ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 11.02.2026 | సంపుటి :12 సంచిక : 203 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## పుర,నగర పోరుకు
# సర్వం సిద్ధం

### తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు
### 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లలో పోలింగ్

- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా



ఆదిలాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఎన్నికల కేంద్రం



ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లలో నిమగ్నమైన పోలింగ్ సిబ్బంది

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణ పేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్ప టికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత

మిగతా 2లో..

## టెట్ ఫలితాలు
# విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ టెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జనవరి 3 నుంచి 20 వరకు ఈ పరీక్షలు జరగ్గా.. మంగళవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ అధికారులు ఫలితాలను ప్రకటించారు. ఇటీవల టెట్ ప్రాథమిక

మిగతా 2లో..



## రాష్ట్రపతి వద్ద 42% రిజర్వేషన్ల
# బిల్లు

### ఎంపీ ఈటల ప్రశ్నకు కేంద్రం సమాధానం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ఇప్పుడు కేంద్రం పరిధిలోకి చేరింది.



మిగతా 2లో..



# బీఆర్ఎస్ నేతలు ఇంకా ఫోన్‌ట్యాపింగ్ చేస్తున్నారు

### మంత్రి పొంగులేటి అనుమానం • బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!

- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం
- ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం
- పుర పోరులో కాంగ్రెస్ 80 % పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా

**ఖమ్మం రూరల్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బుధవారం జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుంది" అని అన్నారు.

**అభివృద్ధికి పెద్ద పీట**

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు

మిగతా 2లో..

## ఎన్నికలకు ఒకరోజు ముందు
# అనూహ్య ఘటన

- మక్తల్ ఆరోవార్డు అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య
- ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బీజేపీ
- పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్ రెడ్డి, లక్ష్మణ్
- డీజీపీ ఆఫీస్ ముట్టడికి బీజేపీ యత్నంతో ఉద్రిక్తత



**మక్తల్(జనంసాక్షి):** ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసి..ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో ఆరో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేస్తున బిజెపి అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున నారాయణపేట జిల్లా మక్తల్‌లో జరిగింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు . మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు ఎస్టీలకు రిజర్వు కావడంతో ప్రధాన పార్టీలు ముగ్గురు సొంత అన్నదమ్ములనే రంగంలోకి దించాయి. ఇందులో భారతీయ జనతా పార్టీ నుండి మహదేవ్ (43), కాంగ్రెస్ నుంచి అతడి అన్న పోటీలో ఉండగా.. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన వారి తమ్ముడు నామినేషన్ ఉపసంహరణ రోజున పోటీ నుంచి తప్పుకున్నాడు. పోటీలో ఉన్న ఇద్దరు అన్నదమ్ములు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. అయితే, నిన్నటి నుంచి డబ్బు, మద్యం పంపిణీ జరుగుతుండడంతో.. 6వ వార్డులోనూ పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులు కోరినట్లుగా సమాచారం. తాను లక్ష రూపాయలు మాత్రమే ఖర్చు చేయగలను.. మిగతాది తన వల్ల కాదని సోమవారం పార్టీ శ్రేణులకు ఆయన తేల్చి చెప్పినట్లుగా తెలుస్తోంది.

మిగతా 2లో..


# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

### నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు

- అవిశ్వాస తీర్మానంపై చర్చకు ఒకరోజు కేటాయింపు
- చర్చ రోజు 50మంది మద్దతు ఉండాల్సిందే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి

మిగతా 2లో..





## స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం

### అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ విధులకు దూరం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస

మిగతా 2లో..

# కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలి • మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు

మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు • పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ - ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు • మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ శివధర్ రెడ్డి వెల్లడించారు. తన కార్యాలయంలో మంగళవారం నాడు మీడియాతో డిజిపి మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తు వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ భద్రత కల్పించామని, ఇందులో 1,302 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి అదనపు బలగాలను మోహరించినట్లు తెలిపారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్రం వెలుపల కూడా నిఘా కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 3 వేల మంది అదనపు బలగాలను రంగంలోకి దించామని, ఇందులో టీజీఎస్పీతో పాటు అటవీ, ఎక్సైజ్, సీఐడీ, లీగల్ మెట్రాలజీ విభాగాల సిబ్బంది కూడా ఉన్నారని వివరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచే ప్రచార పర్వం ముగియడంతో సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చిందని, ప్రస్తుతం విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి గస్తీని ముమ్మరం చేసినట్లు డిజిపి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన గత నెల 27 నుంచి ఇప్పటి వరకు పోలీసులు రికార్డు స్థాయిలో తనిఖీలు చేపట్టి మొత్తం రూ. 3.09 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డిజిపి వెల్లడించారు. ఇందులో రూ. 1.29 కోట్ల నగదు, రూ. 1.21 కోట్ల విలువైన మద్యం, రూ. 15.7 లక్షల విలువైన మాదకద్రవ్యాలు, రూ. 28.69 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. అక్రమ రవాణాను

మిగతా 2లో..

# కెనడా వంతు

### ఆ దేశంపై విరుచుకుపడ్డ ట్రంప్

- అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి మూల్యం చెల్లించాల్సిందే..
- లేకుంటే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను బ్లాక్ చేస్తామని హెచ్చరిక





**వాషింగ్టన్(జనంసాక్షి):** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్య లు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు

మిగతా 2లో..




## హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు!

### ఐటీ నిపుణులకు షాక్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో నివసిస్తూ ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులకు షాకిచ్చేలా అక్కడి చట్టసభలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్టూబ్ ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. 'ఎండింగ్ ఎక్స్‌ప్లాయిటేటివ్ ఇంపోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ యాక్ట్' పేరుతో ఈ బిల్లును ప్రతిపాదించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాలను సవరించి హెచ్-1బీ వీసా విధానానికి పూర్తిగా స్వస్తి పలకడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. అమెరికా పౌరుల

మిగతా 9లో..

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే...
- సొమ్ములు మావి... గొప్పలు మీవా?
- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు
- అది తెలంగాణ ప్రజల సొమ్ము
- కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది రూ.51 వేల కోట్లు మాత్రమే: మంత్రి తుమ్మల



**హైదరాబాద్,ఫిబ్రవరి10(జనంసాక్షి):** కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే

మిగతా 2లో..

### చిన్నారుల మిస్సింగ్ కేసులు..
## కేంద్రానికి రాష్ట్రాలు సహకరించాల్సిందే..

### 'సుప్రీం' కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా చిన్నారుల అదృశ్యం ఘటనల వెనుక ఏదైనా నెట్‌వర్క్ హస్తం ఉందా? రాష్ట్రస్థాయిలో ఏవైనా ముఠాలు పనిచేస్తున్నాయా? అనేది గుర్తించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఘటనల వెనుక ఏదైనా ప్యాటర్న్ ఉందా? లేదా యాదృచ్ఛికంగా జరిగాయా? అనేది నిర్ధరించాలని సూచించింది. కిడ్నాపర్ల నుంచి రక్షించిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి, వాటి వెనుక ఎటువంటి ముఠాలు ఉన్నాయో తెలుసుకోవాలని

మిగతా 2లో..



## బీఆర్ఎస్ నేతలు ఇంకా ఫోన్‌ట్యాపింగ్ చేస్తున్నారు

కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన



ఈ క్రమంలో ఒత్తిడికి గురైన మహదేవప్ప ఈరోజు తెల్లవారుజామున తన ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. మహదేవప్ప ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి కావడంతో ఆ వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మహదేవ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహదేవ్ ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.. ఇందుకు నిరసనగా బిజెపి భగ్గుమంది. ప్రత్యర్థుల వేధింపుల వల్లనే మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించింది. సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ కిడ్నాప్‌లకు, బెదరింపులకు పాల్పడిందని ఆరోపిస్తూ...నిరసనగా హైదరాబాద్ డీజీపీ కార్యాలయ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు భారీగా మోహరించారు. ఇకపోతే లోక్‌సభలో కిషన్ రెడ్డి, రాజ్యసభలో డాక్టర్ లక్ష్మణ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి బెదరింపులకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థులు భయంతో వణికేలా చేస్తున్నారని రాజ్యసభలో లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని లోక్‌సభలో కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇక హైదరాబాద్‌లో డిజిపి ఆఫీస్ ముందు బిజెపి ఆందోళనకు దిగింది. మహదేవప్ప మృతితో బిజెపి శ్రేణులు భారీగా తరలివచ్చి డీజీపీ ఆఫీసు దగ్గర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ డీజీపీ ఆఫీసు ముట్టడికి యత్నించింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ ఆఫీసు దగ్గరకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. డీజీపీ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించారు. బారికేడ్లు దూకేందుకు యత్నించారు.దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. పలువురిని అరెస్ట్ చేశారు. ఞష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనుండగా.. మక్తల్ మున్సిపాలిటీలో 6 వార్డ్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.. మహాదేవప్ప మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

మహాదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహాదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరుణతో కలసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహాదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహాదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

## కేంద్రానికి రాష్ట్రాలు సహకరించాల్సిందే..

పేర్కొంది. ఈమేరకు అన్ని రాష్ట్రాల నుంచి డేటాను సేకరించాలని చెప్పింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.కాగా కొన్ని రాష్ట్రాలు తప్పిపోయిన పిల్లల సమాచారం ఇస్తున్నాయని.. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ డేటాను పంచుకోవడానికి నిరాకరిస్తున్నాయని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. అవసరమైతే సమాచారాన్ని అందించని రాష్ట్రాల విషయంలో కఠిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిని నియమించాలని సూచించింది. అదృశ్యమైన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్‌లో అన్ని రాష్ట్రాల మిస్సింగ్ వివరాలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది. ఇదీ చదవండి: నరవణె పుస్తకం.. ఒక్క కాపీ కూడా పబ్లిష్ కాలేదు: పెంగ్విన్

## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం

వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం

ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్– అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఞరత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు.

# పుర,నగర పోరుకు సర్వం సిద్ధం

ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళ వారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజిపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అరికట్టేందుకు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను, జిల్లాల సరిహద్దుల్లో 55 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతున్నామన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ప్రత్యేక తనిఖీలు సాగుతున్నాయని, ఇందుకోసం 181 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 167 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ముందస్తు జాగ్రత్త చర్యగా రాష్ట్రవ్యాప్తంగా 1,183 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 4,318 మందిని బైండోవర్ చేసినట్లు డిజిపి వివరించారు. వివిధ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న 398 నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేశామని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటివరకు 142 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణపై క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామని, ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, భయం లేకుండా తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని డిజిపి సూచించారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి శ్రీ మహేష్ ఎం భగవత్ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

- చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- బాబుకు గురు దక్షిణ

సమర్పిస్తున్నట్లుగా ఉంది: హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):**కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు.ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నాయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు.

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

'కీ' విడుదల చేసిన అధికారు లు.. ఫిబ్రవరి 1 వరకు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన విషయం తెలిసిందే. తాజాగా ఫలితాలతో పాటు తుది కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ జర్నల్ నంబర్/హాల్‌టికెట్ నంబర్, పేపర్‌ని సెలక్ట్ చేసుకొని, పుట్టిన తేదీ ఎంటర్ చేసి రిజల్ట్స్ పొందొచ్చు.టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షలకు పైగా దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మొత్తంగా టెట్ పరీక్షకు 1,95,181 మంది హాజరు కాగా.. వీరిలో 65,605 మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. టెట్ పరీక్షలో మొత్తంగా 1,00,270 మంది(51.37శాతం) క్వాలిఫై కాగా.. అందులో 37,893 మంది (57.76%)ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

## ఏఐ కంటెంట్‌పై లేబులింగ్ తప్పనిసరి

సోషల్‌మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందిన కంటెంట్ కొత్త సవాళ్లు విసురుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌కు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా లేబుల్ వేయాలని కేంద్రం ఆదేశించింది. ఏఐ కంటెంట్‌ను అందరూ సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని సూచించింది. ఒకసారి అప్లయ్ చేశాక లేబుల్‌ను గానీ, మెటా డేటాను గానీ తొలగించడానికి లేదా కనబడకుండా చేయడానికి వీల్లేకుండా ఉండాలంది.అలాగే, చట్టవిరుద్ధమైన, అసభ్య, మోసపూరిత ఏఐ కంటెంట్‌ను నిరోధించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఆటోమేటెడ్ సాధనాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు, శిక్షల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మూడునెలలకోసారి యూజర్‌కు సందేశాలు పంపించాలని సామాజిక మాధ్యమాలకు ఆదేశించింది. ఏఐ జనరేటెడ్ లేదా డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించాలని ప్రభుత్వం లేదా కోర్టులు ఆదేశించినప్పుడు దాన్ని మూడు గంటల్లోనే తొలగించేలా సామాజిక మాధ్యమాలకు కేంద్రం గడువు విధించింది.

### కెనడా వంతు


ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్–డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది.దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

## రాష్ట్రపతి వద్ద 42% రిజర్వేషన్ల బిల్లు

రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ప్ర భుత్వ ఉద్యోగాలు , స్థానిక సం స్థల ఎన్నికల్లో బీసీ రిజర్వే షన్లను 42 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా, దీనికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వెల్లడిం చింది. లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి బీఎల్ వర్మ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రెండు బిల్లులు కేంద్రానికి అందాయని స్పష్టం చేశారు. ఈ బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల శాతం పెంచడం అనేది రాజ్యాంగ పరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ రెండు బిల్లులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి భవన్‌కు పంపడం జరిగింది. తెలంగాణలోని బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చే క్రమంలో 42 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రతిపాదనపై కేంద్రం వివిధ కోణాల్లో అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం ఈ బిల్లులు పరిశీలన దశలో ఉన్నాయని, తదుపరి చర్యలు రాష్ట్రపతి ఆమోదంపై ఆధారపడి ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఈటల రాజేందర్ వేసిన ఈ ప్రశ్నతో బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియపై రాష్ట్రంలో నెలకొన్న సందిగ్ధతకు కొంత వరకు తెరపడినట్లయింది. కేంద్రం తీసుకునే తదుపరి నిర్ణయంపైనే తెలంగాణలోని బీసీ సామాజిక వర్గాల రాజకీయ , ఉపాధి భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించిన హైడ్రా

**హైదరాబాద్(జనంసాక్షి):**మహా నగరంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన ఆపరేషన్‌లలో రూ.1,500 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది.శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లో 4 ఎకరాల జంగంకుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు కబ్జాదారులు సిద్ధమయ్యారు. హైడ్రా అధికారులు కబ్జాదారుల ఆటకట్టించి రూ.700 కోట్ల విలువైన భూమిని కాపాడారు. రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఆక్రమణలను నిర్ధరించి అక్రమార్కులపై కేసు నమోదు చేశారు.అల్వాల్ మండలంలోని కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలకు గురైంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా... వాటిని తొలగించింది.వనస్థలిపురం జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్క్ స్థలాన్ని, మౌలాలి సర్కిల్ పరిధిలోని రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్క్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.




# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా స్పీకర్‌పై ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. మరి ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నియమనిబంధనలు ఇలావున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) కింద లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టొచ్చు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదిస్తే స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ తమ పదవిని కోల్పోతారు. ఈ తీర్మానానికి సంబంధించి కనీసం 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం, లోక్‌సభ ఎంపీ ఎవరైనా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టొచ్చు. ఇందుకోసం లిఖిత పూర్వకంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ తరువాత సభలో నిర్వహించాల్సిన కార్యకలాపాల జాబితాలో ఈ తీర్మానాన్ని చేరుస్తారు. దీనిపై చర్చకు ఒక తేదీని కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ తేదీని డిప్యూటీ స్పీకర్ నిర్ణయించనున్నారు. ఇక నిర్ణీత తేదీన లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ సమయంలో సభలో ఉన్న కనీసం 50 మంది ఎంపీలు తీర్మానికి మద్దతు తెలిపితేనే ఓటింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. లేకపోతే ఆదిలోనే ఇది వీగిపోతుంది. తీర్మానాన్ని సభ ఓటింగ్‌కు స్వీకరించాక ఎంపీలు మూజువాణీ ఓటు ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ ఓటింగ్ విధానాల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ప్రతిపక్షాల తీర్మానం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే డిప్యూటీ స్పీకర్ దాన్ని స్వీకరిస్తారు. అంటే ఎలాంటి సాంకేతిక, ఇతరత్రా లోపాలు ఉండకూడదు. తీర్మానంలో ప్రతిపక్షాలు పేర్కొన్న ఆరోపణలు స్పష్టంగా ఉండాలి. సభ్యుల వాదనలు, అభిప్రాయాలు, అన్వయాలు, అవమానకరంగా ఉండే వ్యాఖ్యలకు అవిశ్వాస తీర్మానంలో చోటు ఉండదు. ఇందుకు అనుగుణంగా ఉన్న తీర్మానాన్నే డిప్యూటీ స్పీకర్ స్వీకరిస్తారు. ఇక ఓటింగ్ రోజున సభలో ఉన్న మెజారిటీ ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేస్తేనే ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి 293 ఎంపీల మద్దతు ఉంది. ప్రతిపక్ష ఐఎన్‌డీఐఏ కూటమిలో 238 ఎంపీలే ఉన్నారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

### స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం

గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి.

## తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024–25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం÷–ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు.అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు.

## యూకే ప్రధాని రేసులో షబానా

**లండన్(జనంసాక్షి):**ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం బ్రిటన్‌లో మరోసారి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒకవేళ స్టార్మర్ వైదొలిగితే యూకే తదుపరి ప్రధానిగా ఎవరు ఎన్నికవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఈ రేసులో మహిళా ఎంపీ షబానా మహ్మద్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ చరిత్రలోనే పాక్ మూలాలు ఉన్న తొలి ముస్లిం ప్రధానిగా షబానా నిలవనున్నారు. షబానా మహ్మద్ ప్రస్తుతం స్టార్మర్ ప్రభుత్వంలో హోం మంత్రిగా కొనసాగుతున్నారు. 45 ఏళ్ల షబానా 2010 నుంచి బర్మింగ్‌హమ్ లేడీవుడ్ స్థానానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వృత్తిరీత్యా బారిస్టర్ అయిన ఆమె.. ఆ తర్వాత రాజకీయాల వైపు ఆసక్తితో లేబర్ పార్టీలో చేరారు. అనతికాలంలోనే పార్టీలో ఉన్నత పదవులకు చేరుకున్నారు.తన పార్లమెంట్ కెరీర్‌లో షాడో క్యాబినెట్‌లో స్థానం సాధించారు. యూకేలో ప్రభుత్వ మంత్రిమండలి నిర్ణయాలను పరిశీలించడం కోసం ప్రతిపక్షం ఏర్పాటుచేసుకునే సొంత క్యాబినెట్‌ను షాడో క్యాబినెట్‌గా పిలుస్తారు. లేబర్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో షాబా జస్టిస్ సెక్రటరీ, షాడో ఎడ్యుకేషన్ సెక్రటరీగా వ్యవహరించారు. 2025లో లేబర్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆమె హోం మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు.బ్రిటన్‌కు వలసవచ్చిన పాకిస్థానీ దంపతులకు 1980లో షబానా జన్మించారు. లేబర్ పార్టీలో బలమైన నేతగా ఇప్పటికే ఆమెకు పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్టార్మర్ వైదొలగాల్సివస్తే.. పార్టీ పగ్గాలు అందుకునేందుకు ఆమె సమర్థవంతమైన నాయకురాలని లేబర్ పార్టీ నాయకులు భావిస్తున్నారు.లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న పార్టీ సీనియర్ నేత మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించిన ప్రధాని కీర్ స్టార్మర్ పదవీగండాన్ని ఎదుర్కొంటున్నారు.

# లా సెట్ పరీక్షపై నేడు టి-సాట్ స్పెషల్ లైవ్

- టీ-సాట్ సాఫ్ట్‌నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : మే 18వ తేదిన జరిగే తెలంగాణ లా సెట్ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఈ నెల 11వ తేదిన టి-సాట్ ప్రత్యేక అవగాహన లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిపుణ ఛానల్ లో ప్రసారమయ్యే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో లా సెట్ తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి సలహాలు-సూచనలు అందిస్తారన్నారు. లా సెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ తమ సందేహాలను లైవ్ కార్యక్రమం ద్వార పరిష్కరించుకోవచ్చన్నారు.

12వ తేది నుండి ప్రత్యేక ప్రసారాలు మే 18వ తేదిన నిర్వహించబడే లా సెట్ పరీక్ష కోసం తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు 11వ తేదిన లైవ్ కార్యక్రమం అనంతరం ఈ నెల 12వ తేది నుండి ప్రత్యేక డిజిటల్ ప్రసారాలు కొనసాగించనున్నట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 12వ తేది ఫిబ్రవరి నుండి మే 12వ తేది వరకు 90 రోజులు పాటు రోజుకు రెండు పాఠ్యాంశ భాగాల చొప్పున 180 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నామని, సాయంత్రం ఆరు నుండి ఏడు గంటల వరకు టి-సాట్ నిపుణ ఛానల్, ఉదయం ఆరు నుండి ఏడు గంటల వరకు విద్యలో పున: ప్రసారం కానున్నాయని సీఈవో వివరించారు. జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటి, కరెంట్ అఫైర్స్ అండ్ అప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ అఫ్ ద లా సబ్జెక్టులపై ప్రత్యేక ప్రసారాలుంటాయని, టి-సాట్ ప్రసారం చేసే డిజిటల్ పాఠ్యంశాలను తెలంగాణ యువత సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# చికిత్స కోసం వెళితే.. గర్భం పోయింది..

- సాయిరత్న ఆసుపత్రిలో దారుణం
- వైద్యుల నిర్లక్ష్యమే కారణం
- కుటుంబ సభ్యుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని డిమాండ్





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సాయిరత్న ఆసుపత్రిలో దారుణం జరిగింది. ఓ ఎస్టీ మహిళా చికిత్స కోసం ఆసుపత్రికి వెళితే.. గర్భం పోయింది.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు.. ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.. బాధితులు హాసిని, ఆమె అత్త జరుపుల పద్మ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీ టీటు క్వార్టర్స్ కు చెందిన జరుపుల హాసిని నాలుగు నెలల గర్భవతి కాగా స్థానిక సాయిరత్న ఆసుపత్రిలో ప్రతి నెల వచ్చి చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం హాసినికి కడుపులో నొప్పి రావడంతో వెంటనే సాయిరత్న ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే డ్యూటీలో ఉన్న నర్సు కు విషయం చెప్పగా ఒక ట్యాబ్ లెట్ ఇచ్చింది. ఆ ట్యాబ్ లెట్ వేసుకున్న కొద్ది సేపటికే ఉమ్మనీరు రావడంతో నర్సు కు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, డాక్టర్ కు ఆలస్యంగా వచ్చి స్కాన్ చేయించగా హార్ట్ బీట్ లేదని చెప్పడం జరిగిందని, అబార్షన్ చేయించారని తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యానికి తమ కోడలు హాసిని గర్భం కోల్పోయిందని, వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాక్టర్ ప్రవళికతో మాట్లాడించి సమస్య సద్దుమణియేలా ప్రయత్నించినప్పటికీ కుటుంబ సభ్యులు శాంతించలేదు. ఆసుపత్రి పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- రేపటి సార్వత్రిక సమ్మెనుజయప్రదం చేద్దాం
- చైతన్య మహిళా సంఘం పిలుపు

హైదరాబాద్ (జనంసాక్షి) : 29 కార్మిక చట్టాలను మార్చివేసి నాలుగు లేబర్ కోడ్లను నవంబరు 21వ తేదీ నుండి అమలులోకి తీసుకొచ్చిందని, ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్స్ జ్యోతి, రాధా, శ్రీదేవి డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మొత్తంగా 23 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నదని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం కూడా లేబర్ కోడ్ లు అమలులో భాగంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం కూడా చేసిందని, ఈ నాలుగు లేబర్ కోడ్ లు సంఘటిత అసంఘటిత రంగ కార్మికులకు ప్రయోజనం అని పాలకులు కలబొల్లి కబుర్లు చెప్తున్నారని, ఏ ఉద్యోగులు కార్మికులు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయాలి అంటుందని, అందులోనే సెక్షన్ వన్ బి లో ఉద్యోగులు కానీ కార్మికులు 12 గంటలు వరకు పని చేయించుకునే అధికారం యాజమాన్యాలకు కల్పించిందని, 18 వేల రూపాయల నెల వేతనం దాటిన కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించవు అతడు కార్మికుడు కాదు సూపర్వైజర్ కేటకేరీలోకి వస్తారని అప్పుడు యజమానులు వాళ్లను పని నుండి ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా తొలగించవచ్చని, ఈ విధంగా ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి కార్మిక వర్గ శ్రమ దోపిడీని పెట్టుబడిదారులకు దోచి పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలను ఖండిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిలవాలని కోరారు.

# రాష్ట్రపతి వద్ద 42శాతం రిజర్వేషన్ల బిల్లు

- ఎంపి ఈటెల ప్రశ్నకు కేంద్రం సమాధానం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ఇప్పుడు కేంద్రం పరిధిలోకి చేరింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు , స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా, దీనికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది. లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి బీఎల్ వర్మ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రెండు బిల్లులు కేంద్రానికి అందాయని స్పష్టం చేశారు. ఈ బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల శాతం పెంచడం అనేది రాజ్యాంగ పరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ రెండు బిల్లులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి భవన్‌కు పంపడం జరిగింది. తెలంగాణలోని బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చే క్రమంలో 42 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రతిపాదనపై కేంద్రం వివిధ కోణాల్లో అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం ఈ బిల్లులు పరిశీలన దశలో ఉన్నాయని, తదుపరి చర్యలు రాష్ట్రపతి ఆమోదంపై ఆధారపడి ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఈటల రాజేందర్ వేసిన ఈ ప్రశ్నతో బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియపై రాష్ట్రంలో నెలకొన్న సందిగ్ధతకు కొంత వరకు తెరపడినట్లయింది. కేంద్రం తీసుకునే తదుపరి నిర్ణయంపైనే తెలంగాణలోని బీసీ సామాజిక వర్గాల రాజకీయ , ఉపాధి భవిష్యత్తు ఆధారపడి ఉంది.



## సీఎం ప్రజావాణికి 375 దరఖాస్తులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 375 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 126, రెవెన్యూ శాఖకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 172, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి నిబంధనల ఉల్లంఘన

హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాన్వాయ్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హల్‌చల్ చేశారు. దీంతో ఎన్నికల సంఘం మంత్రిపై కేసు నమోదు చేసింది. మరోవైపు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా గద్వాలపట్టణంలో మంగళవారం ఉదయం నుంచి వార్డుల్లో పర్యటించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మీటింగ్ లు నిర్వహించారు.

## పట్టాలపై తలపెట్టి టెక్కీ ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : రైలు పట్టాలపై తల పెట్టి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖైరతాబాద్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన వై.తరుణ్ (30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతనికి 2017లో హైదరాబాద్‌కు చెందిన ప్రసన్నతో వివాహమైంది. ఈ దంపతులకు మూడేళ్ల కుమార్తె ఉంది. నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అత్తారింటికి సమీపంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. తరుణ్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఏడాది నుంచి చికిత్స తీసుకుంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఖైరతాబాద్ రైల్వే గేటు సమీపంలో పట్టాలపై కనిపించడంతో విధుల్లో ఉన్న గేట్ మెన్ బయటకు పంపించారు. కాసేపటి తర్వాత రైల్వే గేట్‌కు దాదాపు వంద అడుగుల దూరంలో పట్టాలపై తల పెట్టి పడుకున్నాడు. ఆ సమయంలో నాంపల్లి వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే అతని పక్కన ఉన్న ఫోన్ రింగ్ అవుతోంది. పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడగా.. మృతుడి వివరాలు తెలిశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నాంపల్లి జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికాలో ఎనిమిది మంది అరెస్టు

- వ్యభిచారం, మానవ అక్రమరవాణా కేసులో పోలీసుల చర్యలు
- నిందితుల్లో వరంగల్‌కు చెందిన సుహృత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి) : అమెరికాలో జార్జియా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు వ్యక్తి చాడ సుహృత్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అట్లాంటా శివారు ప్రాంతాలైన శాండీ స్ప్రింగ్స్, డన్వుడీ పోలీసులు సంయుక్తంగా అండర్ కవర్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహించిన వీరిని పట్టుకున్నారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార ముఠాలపై మానవ అక్రమ రవాణా లక్ష్యంగా జనవరి 29, 30వ తేదీల్లో ఆపరేషన్ శాండీ స్ప్రింగ్స్ గార్డియన్ పేరుతో అమెరికాలో పోలీసులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అట్లాంటాలోని పవర్స్ ఫెర్రీ రోడ్డు సవిపంలోని హోటళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. అక్రమంగా లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం, వ్యభిచారం కోసం సంప్రదించడం వంటి నేరాలు కింద 8 మందిని పట్టుకున్నారు. వీరిపై సొలిసిటేషన్ ఫర్ ఇల్లిసెట్ సెక్సువల్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఇలాంటి నేరాల్లో పట్టుబడటం ఇప్పుడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టయిన చాడ సుహృత్ రెడ్డిది తెలంగాణలోని వరంగల్‌గా తెలుస్తోంది. 2020లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. 2022లో అమెరికాలోని అరిజోనా స్టేట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఎంఎస్ పూర్తి చేసినట్లు సమాచారం. వ్యభిచారం కింద అతనిపై కేసు నమోదైంది. ఈ కేసు రుజువైతే ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.90 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

- కాంగ్రెస్ చర్యలపై ఈసీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కుతోందని భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినిని కలిసి, అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలపై సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించింది. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి కాంగ్రెస్ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రచారం ముగిసినా.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి సదానంద్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఒక మంత్రి గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, ట్రెజరీ అధికారులు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వారు మండిపడ్డారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వన్ టౌన్ మరియు రూరల్ సీఐలు కాంగ్రెస్ నాయకులు పంచుతున్న మద్యం, డబ్బుకు రక్షణ కల్పిస్తూ..ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు పోలీసుల అండతో ప్రతిపక్ష పార్టీల ఓటర్లను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు అవకాశం లేకుండా చేస్తున్నారని కమిషన్‌కు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల విధుల్లో పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను వెంటనే బదిలీ చేయాలి. క్షేత్రస్థాయిలో వీడియో ఫుటేజీలను పరిశీలించి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. సామాన్య ఓటరు భయం లేకుండా ఓటు వేసేలా తటస్థ వాతావరణాన్ని కల్పించాలని కోరారు.

# నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు



ముంబై, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బెదిరింపులు వచ్చాయి. వాట్సప్ వాయిస్ నోట్ ద్వారా ఓ దుండగుడు ఆయన్ను బెదిరించాడు. నటుడి నుంచి రూ. కోట్లు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసుల దృష్టికి రణ్‌వీర్ తీసుకెళ్లడంతో విచారణ మొదలుపెట్టినట్లు సమాచారం. బెదిరింపుల నేపథ్యంలో రణ్‌వీర్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. జుహు (ముంబయి)లోని బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్ శెట్టి నివాసం వద్ద ఇటీవల కాల్పులు జరిగాయి. ఈ ఘటన చోటుచేసుకున్న పది రోజుల్లోనే రణ్‌వీర్‌కు బెదిరింపులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రణ్‌వీర్ లేటెస్ట్ మూవీ 'ధురంధర్' రూ.1300 కోట్ల కలెక్షన్లతో రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.

# ఏపీ అసెంబ్లీలో ఇక డిజిటల్ హాజరు విధానం

**సంతకాల రిజిస్టర్‌కు చెల్లుచీటీ**

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం**

అమరావతి, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైకాపా ఎమ్మెల్యేల వరుస గైర్హాజరు నేపథ్యంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి డిజిటల్ విధానంలోనే ఎమ్మెల్యేల హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపోతే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అధికారులు, పోలీస్ అధికారులతో స్పీకర్ అయ్నయన్నా, డిప్యూటి స్పీకర్ రఘురామరాజులు సమావేశమయ్యారు. కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే సభకు హాజరు కాని సభ్యులు జీతాలు తీసుకోవడం, ఎమ్మెల్యేలుగా కొనసాగడం సబబా? అని వివిధ సందర్భాల్లో స్పీకర్ అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకున్న విచక్షణాధికారాలతో ఎమ్మెల్యేల హాజరుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి ఇప్పటి వరకు వైకాపాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి హాజరుకావడం తప్ప.. శాసనసభ సమావేశాల్లో పాల్గొనడం లేదు. వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైతే.. ఆ సభ్యుడిపై అనర్హత వేటు వేయవచ్చని చట్టంలో ఉందని శాసనసభ వ్యవహారాలశాఖ అధికారులు చెబుతున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో సభకు వచ్చినంత మాత్రాన సమావేశాలకు హాజరైనట్టు పరిగణనలోకి తీసుకోరని తెలుస్తోంది. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలో.. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, దొంగ చాటుగా సంతకాలు చేసి వెళ్లిపోకుండా డిజిటల్ హాజరు ప్రవేశ పెట్టాలని స్పీకర్ నిర్ణయించారు. నేటి గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాల్లో కౌంట్ కాదనేది ప్రభుత్వ వర్గాల వాదన. గవర్నర్ ప్రసంగం తర్వాత జరిగే బీఏసీ సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు ఇప్పటి వరకు బీఏసీ సమావేశానికి హాజరైన సందర్భాలు లేవు. ఈ క్రమంలో ఇకపై అసెంబ్లీకి హాజరైన ఎమ్మెల్యేలు హాజరు డిజిటల్ పద్ధతిలో నమోదు చేయాలని అసెంబ్లీ అధికారులకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలు ఇచ్చారు..

# విమానాశ్రయ విస్తరణకు ప్లాట్లు ఇచ్చి పాట్లు

**పదేళ్లుగా వేడుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వాలు**


గుంటూరు, ఫిబ్రవరి10 (జనంసాక్షి) : గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూములు, ప్లాట్లు ఇచ్చి రోడ్డున పడ్డాం.. పదేళ్లుగా వేడుకుంటున్నాం.. ప్రభుత్వాలకు మాపైన చిన్నచూపు ఎందుకని బాధితులు వాపోయారు. మంగళవారం రాజధాని ప్రాంతం మందడంలో రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో విమానాశ్రయం బాధితులు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గన్నవరంలో మూడు లే ఔట్ లలో ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన సుమారు 500 ప్లాట్లను విమానాశ్రయం విస్తరణ కోసం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని, బాధితులు గొలుసు భాస్కరరావు, పుష్ప చెప్పారు. 10 ఏళ్ళు గడిచినా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్లాట్లను నేటికీ కేటాయించలేదన్నారు. రాజధానిలో ప్లాట్లు ఇస్తామన్నారని, అది కూడా జరగలేదన్నారు.

# మార్చి 5న అర్జున్ టెండూల్కర్ వివాహం

- కుటుంబంతో కలసి ప్రధానిని ఆహ్వానించిన సచిన్
- రాష్ట్రపతి, రాహుల్, అమిత్ షాలకు కూడా ఆహ్వానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 (జనంసాక్షి) : క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లికి కుటుంబంతో కలసి ప్రధానిని కలసి ఆహ్వానం అందించారు. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబైలో వీరి పెళ్లి జరగనుంది. ఈ నేపథ్యంలో సచిన్ తన కుటుంబంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మంగళవారం కలిశారు. అర్జున్ టెండూల్కర్- సానియా చందోక్ వివాహానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సచిన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్‌ను కూడా కలసి ఆహ్వానాలను అందచేశారు. ఈ భేటీలో అర్జున్‌తో పాటు సచిన్ భార్య అంజలి, కుమార్తె సారా కూడా పాల్గొన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబైలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ టెండూల్కర్ ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ ద్వారా మారిన సంగతి తెలిసిందే.

# వంటిల్లే సైన్స్... కానీ ఇల్లాలుకు గుర్తింపేదీ?



ఆధునికంగా సమాజం ముందుకు పోతున్నప్పటికీ శాస్త్ర, సాంకేతిక రంగాల లో మహిళలు ప్రగతి ఆశించిన స్థాయిలో లేదు. ఐక్యరాజ్యసమితికి లింగ సమానత్వం ఒక ప్రధాన సమస్యగా మారింది. ఈ క్రమంలో శాస్త్ర సాంకేతిక రంగంలో మహిళలు, బాలికలు కీలక పాత్ర పోషించడానికి అంతర్జాతీయ దినోత్సవాన్ని ఫిబ్రవరి 11న ఏర్పాటు చేయాలని 2015న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది. శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణలలో మహిళల మరియు బాలికలు భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఈ రోజు గుర్తుచేస్తుంది. చారిత్రకంగా భారతదేశంలో ఆవిష్కరణలు, డిస్కవరీ, పేటెంట్ వంటి శాస్త్రీయ గుర్తింపుల విషయంలో మహిళల పట్ల వ్యవస్థాగత వివక్షత ధోరణి స్పష్టంగా కనపడుతుంది. ఇది దళిత, బహుజనుల ప్రతిభలో కూడా స్పష్టమవుతుంది. పురుషాధిక్యత, కులాధిక్యతనే దీనికి ప్రధాన కారణం. శాస్త్రీయ విజయాల పరంగా చూస్తే ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో మహిళలు శాస్త్రవేత్తలుగా, వృత్తి నిపుణులుగా రాణించడం అరుదుగా కనబడుతారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక ఆధిపత్య మరియు అణగారిన వర్గాల మహిళలకు, బాలికలకు విద్యా అవకాశాలు లభించాయి. దీంతో ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారు. అయినా అంతరాలు కనబడుతున్నాయి. ఇప్పటికీ భారతదేశంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (రాజుమీ)గ్రాడ్యుయేట్లలో దాదాపు 43శాతం మంది మహిళలు ఉన్నప్పటికీ ఈ రంగంలోని ఉద్యోగాలలో 14శాతం మాత్రమే ఉన్నారు. ఇదే 2035 నాటికి ఉన్నత విద్యలో 50 శాతం లింగ సమానత్వాన్ని సాధించాలనే నూతన జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యానికి సవాలే.

**వంటింటి సైంటిస్ట్ కి ఏది గుర్తింపు?**

వంటిల్లుకు, మహిళకు, సైన్స్ కు మధ్య అవినాభావ సంబంధం ఉంది. వంటిల్లు కేవలం భోజనం తయారయ్యే స్థలం మాత్రమే కాదు. అది ఒక నిరంతర పరిశీలన, ప్రయోగం, ఫలితాల విశ్లేషణతో కూడిన శాస్త్రీయ ప్రక్రియ. అయినా ఆ వంట చేసే ఇల్లాలు శాస్త్రవేత్తగా గుర్తింపు లేదు? ఈ ప్రశ్న మన శాస్త్రీయ అవగాహనకు సైతం సవాలే. శాస్త్రం అంటే ఏమిటి? ఒక సమస్యను గుర్తించడం, అందుకు పరిష్కారం కనుగొనడానికి ప్రయోగం చేయడం, ఫలితాలను పరిశీలించడం, అవసరమైతే పద్ధతిని మార్చడం.

ఎంత మంట? ఎంత నీరు? ఎంత ఉప్పు? ఏ పదార్థం ముందు వేయాలి? ఏది తర్వాత? ఒకసారి విఫలమైతే తదుపరి సారి మార్పు. ఇదంతా వంట గదిలో జరిగే ప్రక్రియ. ఇది శాస్త్రీయ పద్ధతే. వేడి ప్రభావం (థర్మోడైనమిక్స్), రసాయన మార్పులు (కెమిస్ట్రీ), పదార్థాల లక్షణాలు (ఫిజిక్స్), కిణ్వ ప్రక్రియ (ఫెర్మెంటేషన్), పోషక విలువలు (న్యూట్రిషన్ సైన్స్) ఇవన్నీ వంటలో సహజంగా జరిగే శాస్త్రీయ ప్రక్రియలే. కానీ ల్యాబ్ కోట్ వేసుకుని, మైక్రోస్కోప్ ముందు నిలబడితేనే శాస్త్రవేత్త అనిపిస్తాడు. అదే పని వంటగదిలో జరిగితే "ఇల్లు చూసుకునే పని"గా తక్కువ చేసి చేస్తాం. ఇది నిర్లక్ష్యం శాస్త్రీయం కాదు, సామాజికం. ఇది పితృస్వామ్య దృక్కోణ ఫలితం. శాస్త్రాన్ని పురుషుల రంగంగా, ఇంటి పనిని మహిళల సహజ కర్తవ్యంగా చూడడం వల్లే ఈ విభజన ఏర్పడింది. ఒక పని విలువ దాని శాస్త్రీయతపై కాక, దాన్ని ఎవరు చేస్తున్నారు అన్నదానిపై ఆధారపెట్టబడింది. చరిత్రను చూస్తే మరింత స్పష్టమవుతుంది. అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు పునాది వంటగదుల్లోనే పడింది. ఫెర్మెంటేషన్, నిల్వ పద్ధతులు, రుచుల సమతుల్యత–ఇవి అన్నీ ఆధునిక ఫుడ్ సైన్స్‌కు మూలాలు. కానీ వాటికి పేర్లు పురుష శాస్త్రవేత్తలవే. ఇల్లాలి వంటను "సహజ ప్రతిభ"గా చెప్పడం కూడా ఒక మోసం. దీంతో శిక్షణ, మేధ, అనుభవం అన్నింటినీ కనిపించనివిగా చేస్తాం. అదే పని ఒక రెస్టారెంట్‌లో జరిగితే 'చేఫ్', ఒక ల్యాబ్‌లో జరిగితే 'సైంటిస్ట్'. ఇంట్లో జరిగితే మాత్రం గుర్తింపే లేదు. నేడు ఆరోగ్యమైన ఇంటి ఆహారం పట్ల స్పృహ పెరుగుతున్న కాలంలో ఆ ఇల్లాలు శాస్త్రీయ వంటకు విలువ నివ్వాలి. వంటగదిని దాటి మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశిస్తున్నారు. ఇప్పటికీ వంటి గదిలో మహిళలను బంధించడం, కులాలతో ప్రతిభను బంధించడం సైన్స్ కు అర్హనీయం కాదు. ఈ క్రమంలో బాలికలు, మహిళలు ప్రోత్సహించే పథకాలు, విధానాలు, చట్టాలే కన్నా సమాజంలో మనుషుల ఆలోచన విధానంలో కూడా మార్పు రావాలి. అప్పుడే ఆశించిన పురోగతి సాధ్యం.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428


# పర్యాటక కేంద్రాల అభివృద్ధితో ఆదాయం



తెలంగాణ ప్రభుత్వం గత మార్చి 17న కొత్తగా టూరిజం పాలసీని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసి.. దేశ, విదేశీ పర్యాలకు లను ఆకర్షించాలన్నదే సర్కారు లక్ష్యం. దీంతో పాటు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, ప్రభుత్వానికి ఆదాయంతో పాటు సుమారు మూడు లక్షల మందికి ఉపాధి కల్పించాలని తలచింది ప్రభుత్వం. తొలుత రాష్ట్రంలోని 27 ప్రాంతాలను గుర్తించిన పర్యాటక శాఖ.. ఇందులోని 9 ప్రాంతాల్లో అభివృద్ధికి కార్యచరణ చేపట్టింది. వరంగల్ లోని వేయి స్తంబాల గుడి, నాగార్జున సాగర్, భద్రాచలం, కాళేశ్వరం, సోమశిల తదితర ప్రాంతాలున్నాయి. ఇక్కడి వరకు భాగానే ఉన్నా..లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు చేపట్టలేదు. తెలంగాణలో వందలాది చారిత్రరక పర్యాటక కేంద్రాలున్నాయి. ఆయా ప్రాంతాకు గణనీయమైన చరిత్ర ఉంది. సౌకర్యాలు, ప్రచారం కల్పిస్తే పర్యాటకులతో కిట కిటలాడే అవకాశాలుంటాయి. దీంతో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆధాయం సమకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం టూరిజం పాలసీని తీసుకొచ్చినప్పటికీ..కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. రాష్ట్ర ఆదాయంలో పది శాతం రాబట్టాలంటే..ప్రభుత్వం యుద్ద ప్రాతిపదికన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది.


హైదరాబాద్‌లో పురాతన, చారిత్రాత్మక భవనాలు, ప్రదేశాల అభివృద్ధి, నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికులకు అప్పగించే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సిటీ కాలేజ్ భవనం, పురానాపూల్ వంతెన, హైకోర్టు భవనం లాంటి చారిత్రక కట్టడా లనూ పరిరక్షిస్తామని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ నిర్ణయంపై పర్యాటకుల్లో సంతోషం వ్యక్తమైంది. ఇక్కడి వరకు భాగానే ఉన్నా..తెలంగాణా లోని ఆయా జిల్లాల్లోనూ ప్రాచీన, చారిత్రాత్మక కోటలు, దేవాలయాలు అనేకం ఉన్నాయి. అవి ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి పర్యరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ వ్యాప్తంగా ఆనాడు నిజాం నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న చారిత్రాత్మక ఆస్తులు సుమారు 350 వరకు ఉన్నట్లు ప్రాథమిక అంచన. ఇంకా వందల సంఖ్యలో ఉండే అవకాశాలున్నా పరిశోధనలు చేయక పోవడంతో అన్యాక్రాంతమైనట్లు ఆరోపనలున్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు పురావాస్తు, పర్యాటక శాఖల పరిధిలో ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఫేమస్ కోట లు, బావులు, కోటల పరిరక్షణీ ప్రశ్నార్థకంగా మారింది.

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో 95 చారిత్రక ప్రదేశాలు న్నాయి. ఇందులో 15 ముఖ్యమైన కోటలు, అనేక దేవాలయాలూ పరిరక్షణకు నోచుకోలేదు. కరీంనగర్‌కు కొద్ది కిలోమీటర్ల దూరంలో ఎలగందల్ ఖిల్లా ప్రత్యేకంగా చెప్పవచ్చు. ఇక్కడికి వందలాది మంది పర్యాటకులు రోజూ సందర్శిస్తూ ఉంటారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ కోట ట్రెక్కింగ్‌కు అనుకూలం. ఇక్కడి దూద్ బావిది ప్రత్యేకం. పెద్దపల్లి జిల్లా లోని రామగిరి ఖిల్లాతో పాటు జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో పలు చారిత్రక కోటలు పరిరక్షణకు నోచుకోలేదు. జగిత్యాల జిల్లా రాయికల్‌లో అముద్రిత త్రికుటాలయ శాసనం, కరీంనగర్ జిల్లా నగునూరులోని రామలింగాల గుడి వద్ద శిథిలమైన రాతి శాసనాలు, పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలో ధూళికట్టలో ప్రసిద్ధ భౌద్ధారామం ఇలా అనేకం ఉన్నాయి. 1975 నుంచి 1977 వరకు పురావస్తు శాఖ జరిగిన తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి కోటలు, బౌద్ధ స్థూపాలూ బయట పడ్డాయి. మంథనిలో బౌద్ధ, జైన కాలం నాటి క్షేత్రాలున్నాయి. శీలేశ్వర, సిద్ధేశ్వరాలయాలు, వరదరాజ స్వామి ఆలయం లాంటివి 20 వరకు ఉన్నాయి. పురాతన, చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేసి ఆయా ప్రాంతాల్లో వెడ్డింగ్ షూట్స్, ఇతర కార్యక్రమాలకు అద్దెకు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశాలుంటాయి. వివాహాది వేడుకలే కాకుండా ఇతరాత్ర కార్యక్రమాలకు పర్యాటక కేంద్రాలను ఎంచుకుంటారు. దీనిద్వారా టూరిజం శాఖకు ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. పురావస్తు శాఖ, టూరిజం శాఖలను ఒకే గొడుగుకిందకి తీసుక రావాల్సిన అవసరం ఉంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని పర్యాటకులు కోరుతున్నారు.



- చిలగాని జనార్ధన్,
సీనియర్ జర్నలిస్టు
8121938106

# బడుల భవితవ్యంపై టీచర్ల ఆందోళన



తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రేషనలైజేషన్ అంశం ఇప్పుడు కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా, ప్రజా విద్య భవిష్యత్తును తాకే తీవ్రమైన సామాజిక–విద్యా సమస్యగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రేషనలైజేషన్ చేపట్టాలని భావిస్తున్న నేపథ్యంలో, ఉపాధ్యాయ సంఘాలు రోడ్లెక్కడం, నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం వంటి నిరసన కార్య క్రమాలు చేపట్టడం వెనుక ఒక లోతైన ఆందోళన దాగి ఉంది. ఇది ఉద్యోగ భద్రతకో, పోస్టుల సంఖ్యకో పరిమితమైన పోరా టం కాదు. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను ఎలా చూస్తున్నాం అన్న దానికి సంబంధించిన మౌలిక ప్రశ్న.

పదేండ్ల క్రితం జారీ అయిన జీవో–25ను యథాతథంగా అమలు చేయడమే సమస్యకు కేంద్రబిందువు. అప్పటి పరిస్థితులు, విద్యార్థుల సంఖ్య, గ్రామీణ–పట్టణ జనాభా నిర్మాణం, వలసలు, ప్రైవేట్ స్కూళ్ల విస్తరణ వంటి అంశాలు నేటి వాస్తవాలతో పూర్తిగా భిన్నం. అలాంటి పాత జీవోను ప్రామాణికంగా తీసుకుని రేషనలైజేషన్ చేయడం అంటే మారిన కాలాన్ని నిర్లక్ష్యం చేయడమే. ఉపాధ్యాయ సంఘాలు ఇదే అంశాన్ని పదేపదే గుర్తుచేస్తున్నాయి. విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించాల్సిన అవసరం ఉందని, 1:30 కంటే 1:20 నిష్పత్తి విద్యా నాణ్యతకు అనుకూలమని వారు వాదిస్తున్నారు.

ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలు ఒకలా ఉన్నాయి, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవం మరోలా ఉంది. 52 మంది విద్యార్థులు ఉన్న హైస్కూల్‌కు 9 మంది టీచర్లు ఉండగా, 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచర్ కూడా లేకపోవడం ఏ విధమైన న్యాయసమ్మత విధానాన్ని ప్రతిబింబిస్తుంది? ప్రాథమిక విద్య అనేది మొత్తం విద్యా వ్యవస్థకు పునాది. అక్కడే పిల్లల చదువు పట్ల ఆసక్తి, భాషా నైపుణ్యా లు, మౌలిక గణితం, సామాజిక విలువలు రూపుదిద్దుకుంటా యి. ఆ స్థాయిలో ఉపాధ్యాయుల కొరతను సృష్టించడం అంటే భవిష్యత్తును బలహీనపరచడమే.

రేషనలైజేషన్ అన్న పదం వినడానికి సాంకేతికంగా, తటస్థంగా అనిపించవచ్చు. కానీ దాని వెనుక ఉన్న ఆర్థిక తర్కం స్పష్టంగా కనిపిస్తుంది. ఖర్చులు తగ్గించాలి, పోస్టులు కుదించాలి, వ్యవస్థను 'స్లిమ్' చేయాలి అన్న ఆలోచన ప్రభుత్వాలన్నింటిలోనూ కనిపిస్తుంది. అయితే విద్య రంగంలో ఈ విధమైన కోతలు దీర్ఘకాలంలో భారీ సామాజిక మూల్యం చెల్లించుకునే పరిస్థితిని తీసుకువస్తాయి. యునిసెఫ్, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల నివేదికలు స్పష్టంగా చెబుతున్న విషయం ఏమిటంటే, ప్రాథమిక స్థాయిలో ఒక్కో టీచర్‌పై విద్యార్థుల భారం పెరిగితే నేర్చుకునే ఫలితాలు తీవ్రంగా పడిపోతాయి. భారతదేశంలో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలపై మధ్యతరగతి విశ్వాసం తగ్గుతోంది. ఇలాంటి నిర్ణయాలు ఆ నమ్మకాన్ని మరింత క్షీణింపజేస్తాయి.

ఇటీవల పాఠశాల విద్యాశాఖ 2,325 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను రద్దు చేసి, 2,064 కొత్త పోస్టులు సృష్టించాలనే ప్రతిపాదనలు పంపడం వివాదాన్ని మరింత ముదిర్చింది. వాటిలో 261 హెచ్.ఎం, 1,803 పీఈటీ పోస్టులు ఉండటం గమనార్హం. శారీరక విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే అయినా, తరగతిలో బోధించే ఉపాధ్యాయులను తగ్గించి ఇతర పోస్టులు పెంచడం ప్రాధాన్యతల గందరగోళాన్ని సూచిస్తుంది. సెకండరీ గ్రేడ్ టీచర్లు లేకుండా ప్రాథమిక పాఠశాలలు ఎలా నడుస్తాయి అన్న ప్రశ్నకు ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఒకే టీచర్ రెండు, మూడు తరగతులను చూసే పరిస్థితి ఇప్పటికే ఉంది. సెలవులు, శిక్షణలు, ఇతర పరిపాలనా పనుల సమయంలో విద్య పూర్తిగా స్థంభిస్తోంది. అందుకే మండలానికి ఐదుగురు అదనపు టీచర్లను అందుబాటులో ఉంచాలని సంఘాలు కోరుతున్నాయి. ఇది అతి డిమాండ్ కాదు; కనీస నిర్వహణ అవసరం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న రాజకీయ హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలకు ఇలాంటి నిర్ణయాలే బలం చేకూరుస్తున్నాయి.

ప్రభుత్వం ఒక విషయం గుర్తించాలి. రేషనలైజేషన్ అనేది సమానత్వాన్ని సాధించడానికి ఉండాలి, అసమానతలను పెంచడానికి కాదు. ప్రైమరీకి ఒక న్యాయం, హైస్కూల్‌కు మరో న్యాయం అన్న విధానం విద్యా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. రాష్ట్రంలో సుమారు 60 శాతం మంది విద్యార్థులు ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారన్న గణాంకాన్ని విస్మరించలేం. వారి కుటుంబాల ఆర్థిక స్థితి, సామాజిక నేపథ్యం దృష్టిలో ఉంచుకుంటే, ప్రభుత్వ పాఠశాలే వారికి ఏకైక ఆశ. కాబట్టి జీవో–25ను యథాతథంగా అమలు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధ్యాయ సంఘాలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. క్షేత్రస్థాయి డేటాను, విద్యా నిపుణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సవరించిన విధానాన్ని రూపొందించాలి. సంఖ్యలతో కాదు, పిల్లల భవితవ్యంతో విద్యా విధానం నిర్ణయించాలి. లేదంటే రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేరు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

**గుర్తుంచుకో!**

మార్పుసహజం
ప్రతీక్షణం మార్పు!
శిశువు నుండి
బాల్య కౌమార
యవ్వన వృద్ధ దశలు
తుదకుమరణం!
ఇదంతా మార్పే!
నదుల్లో నీరు
పాతనీరుపోయి
కొత్తనీరు!
వేలయేండ్లుగా
నదీప్రవాహం
క్షణం ఆగదు
మారుతూనేఉంది!
జీవులు
ప్రవాహలేకాదు!
నిర్జీవులు కొండలు
పర్వతాలు
స్థావరజంగమాలు
మార్పు ఖాయం!
ఆదిమానవుడు
అడవినుండి
ప్రయాణం
నగరాలవరకు
మారాడు!
గ్రహంతరాలను
శోధిస్తున్నాడు!
పండ్లు పదార్థాలు
కుళ్ళిపోతాయ్!
వాటికాలం
కొన్నిరోజులే!
దేవుడి(ప్రకృతి)సృష్టి
మనిషి ప్రతిసృష్టి
ఏదీ ఆగదు!ఒక్కటే!
ఎవరికైనా
ఆకలి
ఒక్కటే!
మతాలతో
కులాలతో
రాజకీయంచేసి
స్వార్థం
ద్వేషం
పెంచకు
నువ్వూ పోతావ్!
బ్రతికుండగానే
'మంచి' చేద్దాం!
మానవులంతా
ఒక్కటే!
బ్రహ్మ మొక్కటే
పరబ్రహ్మ మొక్కటే
గుర్తుంచుకో!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# పైసల పాలనలో ప్రజాస్వామ్యం: రాజ్యాధికారం!

పైసలు ఉంటేనే రాజ్యాధికారం అనే వాక్యం ఒక నినాదంలా వినిపించినా అది ఆధునిక రాజకీయ వ్యవస్థ యొక్క అంతర్లీన స్వభావాన్ని ప్రతిబింబించే వాస్తవంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాన్ని ప్రజలే నిర్ణయిస్తారనే భావన రాజ్యాంగ గ్రంథాల్లో స్పష్టంగా కనిపించినా వాస్తవ రాజకీయ ప్రక్రియలో అధికారానికి చేరుకునే మార్గం ఆర్థిక శక్తి ఆధీనంలోకి వెళ్లిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. పైసలు ఉన్నోడే పాలిటిక్స్ అనే మాట భావోద్వేగ వ్యాఖ్య స్థాయిని దాటి నిర్మాణాత్మక రాజకీయ విశ్లేషణగా మారింది. పైసలు లేకపోతే ఓటర్ అనే వాస్తవం ప్రజాస్వామ్యంలో పౌరుడి పాత్ర క్రమంగా పరిమితమవుతున్న దుస్థితిని సూచిస్తోంది.

1947 నుంచి 1980 వరకు ఉన్న తొలి దశ రాజకీయ వ్యవస్థను పరిశీలిస్తే ఆ కాలంలో రాజకీయాల్లో డబ్బు పాత్ర చాలా తక్కువ స్థాయిలో ఉండేది. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి వచ్చిన నాయకత్వం సిద్ధాంతబద్ధమైన రాజకీయాలను నమ్మింది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధమే రాజకీయ బలానికి మూలాధారంగా ఉండేది. ఎన్నికల ప్రచారం అంటే ఇంటింటికి వెళ్లడం, బహిరంగ సభలు నిర్వహించడం, స్థానిక పత్రికల్లో అభిప్రాయాలు ప్రచురించడం వరకే పరిమితమయ్యేది. ఆ కాలంలో ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల ఖర్చు సగటున ₹10,000 నుంచి ₹50,000 మధ్యలో ఉండేది. మొత్తం రాజకీయ ప్రభావంలో డబ్బు పాత్ర సుమారు 10% నుంచి 15% వరకే ఉండేది. మిగతా ప్రభావం వ్యక్తిత్వం, ప్రజాసేవ చరిత్ర, ఉద్యమ నేపథ్యం ఆధారంగా ఏర్పడేది.

1980 నుంచి 1990 మధ్య దశలో రాజకీయ వ్యవస్థలో క్రమంగా మార్పులు మొదలయ్యాయి. పరిపాలనా వ్యయం పెరగడం, మీడియా ప్రభావం విస్తరించడం, పార్టీల మధ్య పోటీ తీవ్రత పెరగడం వల్ల డబ్బు అవసరం పెరిగింది. అయినా ఈ దశలో రాజకీయాల్లో డబ్బు ప్రధాన అర్హతగా మారలేదు. 1990 నాటికి ఒక అసెంబ్లీ ఎన్నిక ఖర్చు ₹1,00,000 నుంచి ₹3,00,000 స్థాయికి చేరింది. ఈ దశలో డబ్బు ప్రభావం సుమారు 30% వరకే పరిమితమైంది.

1990 తరువాత భారత రాజకీయ వ్యవస్థ పూర్తిగా కొత్త దిశలోకి ప్రవేశించింది. ఆర్థిక స్వేచ్ఛా విధానాలు రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపాయి. మార్కెట్ ఆధారిత ఆలోచనలు పాలనలోకి ప్రవేశించడంతో రాజకీయాలు కూడా పెట్టుబడి ఆధారిత వ్యవస్థగా మారాయి. ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియగా కాకుండా వ్యూహాత్మక పెట్టుబడి పోటీగా మారాయి. 2000 నాటికి ఒక అసెంబ్లీ ఎన్నికకు ఖర్చు ₹15,00,000 నుంచి ₹30,00,000 స్థాయికి పెరిగింది. ఈ దశలో రాజకీయాల్లో డబ్బు ప్రభావం సుమారు 50% చేరింది.

2010 తరువాత రాజకీయ వ్యవస్థ మరింత కమర్షియల్ స్వరూపాన్ని సంతరించుకుంది. టెలివిజన్ ఛానళ్లు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికలు రాజకీయ ప్రచారాన్ని పూర్తిగా మార్కెటింగ్ రంగంగా మార్చాయి. అభ్యర్థి ఆలోచనలకంటే అతడి ప్రచార శక్తి ఎక్కువ ప్రాధాన్యం పొందింది. 2020 నాటికి ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చు ₹1,50,00,000 నుంచి ₹3,00,00,000 వరకు పెరిగింది. లోక్‌సభ



ఎన్నికల్లో ఈ ఖర్చు ₹8,00,00,000 నుంచి ₹15,00,00,000 వరకు చేరిన సందర్భాలు కనిపించాయి. ఈ దశలో రాజకీయాల్లో డబ్బు ప్రభావం సుమారు 70% నుంచి 80% స్థాయికి చేరింది.

డబ్బు రాజకీయాల్లో పనిచేసే విధానం ఒక స్పష్టమైన ప్రక్రియగా మారింది. మొదట నిధుల సేకరణ జరుగుతుంది. రాజకీయ పార్టీలు పెద్ద దాతలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఈ నిధులు ప్రచారానికి వినియోగించబడతాయి. ప్రచారంలో మీడియా ప్రకటనలు, భారీ సభలు, డిజిటల్ కంటెంట్, వ్యక్తిగత బ్రాండింగ్ ప్రధాన ఆయుధాలుగా మారాయి. ఆ తర్వాత అధికార సాధన జరుగుతుంది. అధికారంలోకి వచ్చిన తరువాత విధాన నిర్ణయాల్లో ఆర్థిక మద్దతు ఇచ్చిన వర్గాల ప్రభావం పెరుగుతుంది.

ఈ పరిణామం ఓటర్ ప్రవర్తనపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. 1990లో ఓటర్ నిర్ణయంలో ప్రచార ప్రభావం సుమారు 40% మాత్రమే ఉండేది. 2020 నాటికి అది 65% దాటింది. సిద్ధాంతం, ప్రజాసేవ నేపథ్యం, సామాజిక నిబద్ధత వంటి అంశాలు క్రమంగా వెనక్కి నెగ్గాయి. డబ్బు ఎక్కువగా ఖర్చు చేసే అభ్యర్థికి కనిపించే స్థాయి పెరిగింది. ఈ స్థితిలో రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే సాధారణ వ్యక్తికి అవకాశాలు తగ్గిపోయాయి.

ఈ మొత్తం విశ్లేషణ చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. మొదటి తరం రాజకీయాల్లో డబ్బు ఒక ఉపకరణం మాత్రమే. రెండో దశలో అది అవసరంగా మారింది. మూడో దశలో అది రాజకీయ అర్హతగా మారింది. ప్రస్తుత దశలో అది ఆధిపత్య శక్తిగా మారింది. ఈ మార్పు ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానత్వ భావనను బలహీనపరుస్తోంది.

అందుకే పైసలు ఉంటేనే రాజ్యాధికారం అనే మాట ఆవేశపూరిత వ్యాఖ్యగా కాకుండా నిర్మాణాత్మక విశ్లేషణగా చూడాల్సిన అవసరం ఏర్పడింది. పైసలు ఉన్నోడే పాలిటిక్స్ అనే భావన గణాంకాలతో నిరూపితమైన వాస్తవంగా నిలుస్తోంది. పైసలు లేకపోతే ఓటర్ అనే వాక్యం ప్రజాస్వామ్యంలో సాధారణ పౌరుడి పాత్ర ఎంత పరిమితమైందో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ రాజకీయ వాస్తవాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిజమైన ప్రజల పాలనగా తిరిగి నిర్మించే ఆలోచనకు బలమైన పునాది ఏర్పడుతుంది. ఈ మొత్తం రాజకీయ విశ్లేషణకు ముగింపుగా ఒక స్పష్టమైన సారాంశం బయటపడుతుంది. ప్రజాస్వామ్యం అనే భావన సిద్ధాంత స్థాయిలో ప్రజల అధికారాన్ని ప్రకటించినా ఆచరణ స్థాయిలో ఆ అధికారాన్ని నిర్దేశించే శక్తి ఆర్థిక మూలధనంగా మారిన పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తోంది. పైసలు ఉంటేనే రాజ్యాధికారం అనే వాక్యం ఒక ఆవేశపూరిత నినాదంగా కాకుండా ఒక నిర్మాణాత్మక రాజకీయ సత్యంగా స్థిరపడింది. ఇది ఒక్క వ్యక్తి అనుభవం ఆధారంగా వచ్చిన వ్యాఖ్య కాదు. 1947 నుంచి 2025 వరకు జరిగిన రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే డబ్బు క్రమంగా రాజకీయ వ్యవస్థలో కేంద్రబిందువుగా మారిన దృశ్యం స్పష్టంగా దర్శనమిస్తుంది.

ప్రారంభ దశలో రాజకీయాలు ప్రజా సేవకు సంబంధించిన నైతిక బాధ్యతగా భావించబడ్డాయి. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యం కలిగిన నాయకత్వం ప్రజలతో జీవన సంబంధాన్ని కొనసాగించింది. ఆ దశలో రాజకీయ నాయకుడికి డబ్బు ఒక సాధనంగా మాత్రమే ఉండేది. ప్రజల విశ్వాసం ప్రధాన మూలధనంగా పనిచేసేది. అయితే కాలం మారిన కొద్దీ రాజకీయ వ్యవస్థలో పోటీ పెరిగింది. పోటీ పెరగడంతో ప్రచారం అవసరం పెరిగింది. ప్రచారం అవసరం పెరగడంతో ఖర్చు పెరిగింది. ఖర్చు పెరిగిన కొద్దీ డబ్బు రాజకీయ ప్రవేశానికి అర్హతగా మారింది. ఈ పరిణామం క్రమంగా రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని మార్చింది.

1990 తరువాత ఈ మార్పు వేగం పెరిగింది. ఆర్థిక స్వేచ్ఛా విధానాలు రాజకీయ వ్యవస్థపై గాఢమైన ప్రభావం చూపాయి. మార్కెట్ ఆలోచనలు పాలనలోకి ప్రవేశించడంతో రాజకీయాలు కూడా పెట్టుబడి ఆధారిత రంగంగా మారాయి. ఎన్నికలు ఒక ప్రజాస్వామ్య కర్తవ్యంగా కాకుండా ఒక భారీ పెట్టుబడి పోటీగా మారాయి. ఈ దశలో డబ్బు లేకుండా రాజకీయాల్లో నిలబడటం అసాధ్యంగా మారింది. 2000 నాటికి రాజకీయాల్లో డబ్బు ప్రభావం సుమారు 50% స్థాయికి చేరింది. 2020 నాటికి అది 75% దాటింది. ఈ సంఖ్యలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. రాజకీయ అధికారానికి దారి తీసే మెట్లు ఆర్థిక శక్తితో నిర్మించబడుతున్నాయి.

ఈ పరిణామంలో అత్యంత ప్రభావితమైన వర్గం సాధారణ ఓటర్. ప్రజాస్వామ్యంలో ఓటర్ సార్వభౌముడిగా భావించబడినా వాస్తవంలో అతడు ఒక లక్ష్య ప్రేక్షకుడిగా మారిపోయాడు. అతడి అభిప్రాయాన్ని నిర్మించడానికి భారీ ప్రచార యంత్రాంగం ఉపయోగించబడుతోంది. డిజిటల్ మీడియా, టెలివిజన్ ప్రచారం, సోషల్ మీడియా వ్యూహాలు ఓటర్ ఆలోచనలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 1990లో ఓటర్ నిర్ణయంలో ప్రచార ప్రభావం సుమారు 40% మాత్రమే ఉండేది. 2020 నాటికి అది 65% దాటింది. ఈ మార్పు ఓటర్ స్వతంత్రతను బలహీనపరుస్తోంది. ఓటు హక్కు ఉన్నా నిర్ణయ స్వేచ్ఛ ఆర్థిక శక్తి ప్రభావంలోకి వెళ్తోంది.

డబ్బు రాజకీయాల్లో ప్రవేశించిన విధానం కేవలం ఎన్నికల వరకే పరిమితం కాలేదు. పాలనలోకి వచ్చిన తర్వాత కూడా ఆర్థిక మద్దతు ఇచ్చిన వర్గాల ప్రభావం విధాన నిర్ణయాల్లో కనిపిస్తోంది. ప్రజా ప్రయోజనాల కంటే పెట్టుబడి ప్రయోజనాలు ప్రాధాన్యం పొందుతున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధమైన పరిస్థితి. ప్రజల పాలన అనే భావన క్రమంగా మూలధన పాలనగా మారుతున్న ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ పరిస్థితి కొనసాగితే రాజకీయ వ్యవస్థలో సామాజిక న్యాయం అనే భావన మరింత బలహీనమయ్యే అవకాశాలు ఉన్నాయి. డబ్బు ఉన్నవారికే రాజకీయ ప్రవేశం సాధ్యమయ్యే పరిస్థితి ఏర్పడితే సామాన్య పౌరుడి స్వరం వ్యవస్థలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. రాజకీయాలు ప్రజల జీవన సమస్యల పరిష్కార వేదికగా కాకుండా పెట్టుబడి లాభాల సాధన వేదికగా మారే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరికగా పరిగణించాలి.

అయితే ఈ విశ్లేషణ నిరాశను మాత్రమే వ్యక్తపరచడం కోసం కాదు. సమస్యను గుర్తించడం పరిష్కారానికి మొదటి అడుగు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగిందని అంగీకరించకుండా ప్రజాస్వామ్య సంస్కరణలు సాధ్యం కావు. ఎన్నికల ఖర్చుల నియంత్రణ, రాజకీయ నిధుల పారదర్శకత, చిన్న దాతల ప్రోత్సాహం, ప్రజా నిధులతో ప్రచారం వంటి ఆలోచనలు ఈ సందర్భంలో ప్రాధాన్యం పొందాలి. ఈ మార్పులు సాధ్యమవ్వాలంటే ప్రజలలో రాజకీయ చైతన్యం పెరగాలి. ఓటర్ తన ఓటు విలువను అర్థం చేసుకోవాలి. ప్రచార ఆర్భాటానికి లోనుకాకుండా అభ్యర్థి నేపథ్యాన్ని పరిశీలించే సంస్కృతి పెరగాలి.

మొత్తంగా చూస్తే పైసలు ఉంటేనే రాజ్యాధికారం అనే వాక్యం ఒక కాలానుగుణ రాజకీయ విశ్లేషణగా నిలుస్తోంది. పైసలు ఉన్నోడే పాలిటిక్స్ అనే భావన నేటి రాజకీయ వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. పైసలు లేకపోతే ఓటర్ అనే నిర్వచనం ప్రజాస్వామ్యంలో సాధారణ పౌరుడు ఎదుర్కొంటున్న పరిమితులను సూచిస్తోంది. ఈ మూడు వాక్యాలు కలిపి నేటి రాజకీయ వ్యవస్థ యొక్క అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నాయి.

ప్రజాస్వామ్యాన్ని నిజమైన ప్రజల పాలనగా నిలబెట్టాలంటే ఈ డబ్బు ఆధిపత్య రాజకీయాలపై లోతైన చర్చ అవసరం. రాజకీయ వ్యవస్థలో ఆర్థిక శక్తి పాత్రను నియంత్రించే విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం ఒక అధికారిక నిర్మాణంగా మాత్రమే మిగిలి ప్రజల ఆశలు క్రమంగా దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ ముగింపు ఒక హెచ్చరికగా కూడా పనిచేస్తుంది. ప్రజాస్వామ్యం నిలవాలంటే ప్రజల స్వరం బలంగా వినిపించాలి. ఆ స్వరాన్ని మించిపోయే స్థాయిలో డబ్బు శబ్దం పెరిగితే రాజ్యాధికారం ప్రజల నుంచి జారిపోతుంది అనే సత్యాన్ని ఈ విశ్లేషణ బలంగా గుర్తుచేస్తోంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# తెలుగు మృత భాష కాదు..అమృత భాష..

సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : తెలుగు మృతభాష కాదని అమృత భాష అని వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండవ రోజు ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 121 లో దేశ విదేశాలలో తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి- మార్గదర్శనం అనే అంశంపై మంగళవారం పద్మ విభూషణ్ సంజీవ నరసింహ అధ్యక్షతన చర్చను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు మాట్లాడారు. జయ పీసపాటి మాట్లాడుతూ హాంకాంగ్ లో తాము తెలుగు ఫెస్టివల్ ను నిర్వహించడంతోపాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యంలను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. అమెరికా న్యూయార్క్ నుంచి హాజరైన గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా తాము తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని చెప్పారు. పద్యాలు, లలిత గీతాలు నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింప చేశామని కల్వల విశ్వేశ్వర్ చెప్పారు. 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి హాజరైన విజయ మాట్లాడుతూ ప్రతి శనివారం రెండు గంటలపాటు తాము తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు . తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని




పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీ నుంచి హాజరైన గణేష్ తొట్టిపూడి మాట్లాడుతూ సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు. వడ్లమాని దుర్గ, జంధ్యాల కిషోర్ శరత్ బాబు లు మాట్లాడుతూ బాల్యం నుంచే తెలుగు భాష పై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మూర్తి రేమిళ్ళ, వెల్మల కృష్ణారావు,నరసింహులు మరాఠీ ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ జయకృష్ణ కిషోర్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె వి ఎన్ డి ప్రసాద్ సగిలి సుధారాణి తదితరులు ప్రసంగించారు.అనంతరం తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆచార్య వై రెడ్డి శ్యామల అధ్యక్షత వహించారు. ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆన్లైన్లో తెలుగు భాషా బోధన గురించి డాక్టర్ ఝాన్సీ ఉడుము, తెలుగు భాషా పరివ్యక్తికి మార్గాలు అనే దానిపై సిరికొండ నరసింహ రాజు, తెలుగులో సాంకేతిక అభివృద్ధి- సాంకేతిక వినియోగం పై రెహమానుద్దీన్ షేక్, తెలుగు పరిశోధనల లో శాస్త్ర సాంకేతికత వినియోగం పై దాసరి కరుణలు ప్రసంగించారు.

### రూమ్ నెంబర్ 133 లో జరిగిన సదస్సు..

తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండో రోజు మంగళవారం రూమ్ నెంబర్ 133 లో " సోషల్ మీడియా లైక్స్, షేర్స్, వైరల్ సాహిత్యం" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రాజీ కన్నా, చరణ్ పరిమి, అమృత రాజ్, సాత్వికలు ఈ అంశంపై ప్రసంగించారు. అలాగే " యువ రచయితల సాహిత్యం- గమనం, గమ్యం" అనే అంశంపై సాయి వంశీ, శివశంకర్, ఉదయ్, రాము వేర్ల వెంకటనారాయణ, విమల లు ప్రసంగించారు. " సీనియర్ రచయితల నుంచి మేమేం కోరుకుంటున్నాం " అనే అంశంపై దండ వెంకట రాములు, బాలు అగ్నివేష్, హతి రామ్, ధరణి లు ప్రసంగించారు. ఈ సదస్సులకు ఆహుతులుగా ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, తెలుగు లిటరరీ కాంగ్రెస్ డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి కాసిం హాజరయ్యారు.

## న్యాయవాదులకు రక్షణ చట్టం కావాలి

- రెండు రోజులు విధులు బహిష్కరించిన న్యాయవాదులు




మహబూబ్ నగర్ టౌన్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) : తెలంగాణ చౌరస్తాలో నిరసన చేవెళ్ల కోర్టులో న్యాయవాది వృత్తిలో ఉన్నటువంటి స్వప్న హత్యను నిరసిస్తూ రెండు రోజులుగా మహబూబ్నగర్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు రెండో రోజు విధుల బహిష్కరణలో భాగంగా కోర్టు ప్రాంగణం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు కెమెరాకు న్యాయవాదుల రక్షణ చట్టం కావాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెద్ద నినాదాలతో న్యాయవాదులు అందరూ కలిసి తెలంగాణ చౌరస్తా చేరుకున్నారు ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ పోలీసుల ఉదాసీన వైఖరి వల్లే ఒక న్యాయవాది నిండు ప్రాణం పోయిందని వారి నిర్లక్ష్యం కారణంగానే ఆమె హత్యకు గురైందని చెప్పారు సకాలంలో పోలీసులు స్పందించి ఉంటే మహిళా న్యాయవాది ప్రాణం నిలబడేదని ఆయన అన్నారు రాష్ట్రంలో ఇటువంటి సంఘటన లు పురాణావతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు దేశవ్యాప్తంగా అమలులోకి రావాలని ఆయన కోరారు స్వప్న న్యాయవాది హత్య చాలా బాధాకరమని మరే న్యాయవాది కూడా ఇటువంటి సంఘటన పట్ల బలికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీనియర్ జూనియర్ మహిళా న్యాయవాదులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు సీనియర్ న్యాయవాది ఆనందరావు చంద్రమౌళి మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకే పోలీసు ఫ్లాగ్ మార్చ్

- అదనపు ఎస్పీ రఘునందన్ రావు



సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) : సంగారెడ్డి సందర్భంగా మంగళవారం అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశానుసారం మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే లక్ష్యంగా సంగారెడ్డి మున్సిపాలిటీ పరిదిలో గల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాలలో జిల్లా పోలీసు, క్విక్ రియాక్షన్ టీమ్ల సహాయంతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశం ప్రజలలో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే అసాంఘిక శక్తులకు, రౌడీషీటర్లకు బలమైన హెచ్చరిక పంపడమేనని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత వ్యక్తులు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుత, న్యాయసమ్మత ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించవలసిందిగా సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, టౌన్ ఇన్స్పెక్టర్ రామునాయుడు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, రూరల్ ఇన్స్పెక్టర్ క్రాంతి, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జెఎస్ఆర్ మాల్ భవనంలో అగ్ని ప్రమాదం

- రెండవ సెల్లార్‌లో ఘటన
- క్లిన్సింక్ క్లీనికల్ రీసెర్చ్ ప్యానెల్ బోర్డులో ఒక్కసారిగా ఎగిసిన మంటలు
- అదే భవనంలో నారాయణ పాఠశాల...
- ఘటనతో ఒక్కసారిగా ఉలికిపడిన విద్యార్థులు..
- సరైన రక్షణ సౌకర్యాలు లేవంటూ మండిపడుతున్న తల్లిదండ్రులు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం మదీనగూడ పరిధి జెఎస్ఆర్ మాల్ బిల్డింగ్ లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద ఘటనకు సంబంధించి స్పష్టమైన వివరాలు తెలియ రానప్పటికీ ఓ విద్యుత్ ప్యానెల్ బోర్డులో చెలరేగిన మంటలు ఈ అగ్ని ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు అంచనా వేస్తున్నారు. అయితే ఇదే జెఎస్ఆర్ మాల్ బిల్డింగ్ భవనంలో నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్, క్లిన్సింక్ క్లీనికల్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుసైతం నిర్వహించబడుతుండడం గమనార్హం. ఈ క్రమంలో రెండవ సెల్లార్ లో ఉన్న క్లిన్సింక్ క్లినికల్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు సదరు సమాచారాన్ని ఇదే భవనంలో ఉన్న నారాయణ పాఠశాల చేరవేయడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన కళాశాల విద్యార్థులు భయంతో ఇటువంటి పరుగులు తీయడంతో కొద్దిసేపు జెఎస్ఆర్ మాల్ భవనంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజన్ తో జెఎస్ఆర్ మాల్ భవనం వద్దకు చేరుకొని ఘటన తీరుపై విచారణ కొనసాగించి సెల్లార్ లోని ప్యానెల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు ఎగసి పడటంతో పెద్ద ఎత్తున దట్టమైన పొగ అలుముకుందని నిర్ధారించుకొని, ఫైర్ ఇంజన్ సహకారంతో మంటలను అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### నారాయణ యాజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రుల రుసరుసలు...

మంగళవారం జెఎస్ఆర్ మాల్ భవనంలో ప్రమాదం చోటుచేసుకుని మంటలు చెలరేగిన విషయాన్ని తెలుసుకున్న నారాయణ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తూ ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థుల యోగక్షేమాలు కనుక్కోవడంతోపాటు ప్రమాద తీరుతన్నులను



అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సదరుభవనానికి కనీస భద్రతా చర్యలు లేకపోవడంపట్ల వారు తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ఏదైనా జరగడానికి జరిగి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని, నారాయణ విద్యాసంస్థల యాజమాన్యానికి డబ్బులు మీద ఉన్న మోజు తమ పిల్లల భవిష్యత్తు, భద్రతపై లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తక్షణమే భవనాన్ని మార్చి విద్యార్థుల కళాశాలను సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.

## ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు ఉపయోగించే సామాగ్రి పంపిణీ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లేతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. మంగళవారం మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, సిబ్బంది పోలింగ్ బూతులకు నిర్ణీత సమయంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని కోరారు. స్ట్రాంగ్




రూములు, కౌంటింగ్ కేంద్రాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహాయం మర్చిపోలేనిది

తాండూరు, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : పట్టణంలోని శ్రీ బావిగి భద్రేశ్వర దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 17 షాపుల నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి పట్టణ వస్త్ర వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం పట్టణంలో ని వస్త్ర వ్యాపారులు కలిసి



సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వస్త్ర వ్యాపారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహాయం మర్చిపోలేనిది అన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరవతోనే పట్టణంలో ప్రశాంత వాతావరణంలో వ్యాపారం నిర్వహిస్తున్నమని తెలిపారు. ఎమ్మెల్యే మాపై చూపిన ఆదరభిమానాలకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

# అధికారుల నిర్లక్ష్యం ఓటర్ల శాపం

- 6 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు
- గంగారం బూరుగుపల్లి సాయిబాబా కాలనీ ప్రజల ఆందోళన
- దాదాపు 3000 మంది ఓటర్లకు తప్పని తిప్పలు
- బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి
- రవాణా సౌకర్యం కల్పిస్తామని అధికారుల హామీ
- చర్యలు తీసుకోండి
- స్పీకర్ ఆదేశం

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) : అధికారుల నిర్లక్ష్యం అశ్రద్ధ కారణంగా మెజారిటీ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడే సమస్య తలెత్తింది. రెండు పోలింగ్ కేంద్రాల వరుస సంఖ్య తారుమారు కావడంతో మూడు కాలనీలా ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలతోపాటు రాజకీయ నాయకులు మున్సిపల్ ముందు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారం సాయిబాబా కాలనీ బూరుగుపల్లి వార్డుల ఓటర్లకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా శాపంగా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల అధికారులు రూట్ మ్యాప్ తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు వరుస సంఖ్య తారుమారు చేసి నివేదిక ఇవ్వడంతో బూరుగుపల్లి గంగారం సాయిబాబా వార్డుల్లో నివసిస్తున్న ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ వార్డుల ఓటర్లు దాదాపు 6 కిలోమీటర్లు ప్రయాణించి తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిన



పరిస్థితి నెలకొంది. ఈ పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలంటే దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున మహిళలు వయోవృద్ధులు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంటుందని వివిధ పార్టీల నాయకులు ఆందోళనకు దిగారు. తక్షణమే పోలింగ్ కేంద్రాలను మార్చాలని బూరుగుపల్లి గంగారం సాయిబాబా కాలనీ వాసులు వికారాబాద్ మునిసిపల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి మాజీ జెడ్పిటిసి ముక్తా షరీఫ్ తీసుకువెళ్లారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చరవాణిలో మాట్లాడారు. అధికారుల తప్పిదం వల్ల దాదాపు 3,000 మంది ఓటర్లు 6 కిలోమీటర్లు ప్రయాణించి ఓటు హక్కును విరియోగించుకోవలసి వస్తుందని వెంటనే పోలింగ్ కేంద్రాలని మార్చాలని కోరారు. ఈ విషయమై జిల్లా ఎన్నికల అధికారి ప్రతిక్ జైన్ రాష్ట్ర ఎన్నికల అధికారులతో మాట్లాడారు. బుధవారం రోజున మున్సిపల్ ఓటింగ్ ఉంటుంది కాబట్టి పోలింగ్ కేంద్రాలను మార్పు చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. దీంతో ఈ మూడు కాలనీలా ఓటర్లు ఆందోళనకు దిగారు. ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గంగారం సాయిబాబా కాలనీ బూరుగుపల్లి ఓటర్లు ఇబ్బంది పడకుండా రవాణా సౌకర్యం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎన్నికల నిబంధన ప్రకారం ఎవరు వాహనాలపై ఓటర్లను తరలించ తరలించవద్దని వారిని భ్రమలో పెట్టకూడదని ఆదేశాలు ఉన్నాయి. కానీ అధికారులు చేసిన తప్పిదం వల్ల వాళ్లే ఓటర్లకు వాహనాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవడం కోసం మెరుపు.. బహుశా రాష్ట్ర ఎన్నికల చరిత్రలో అధికారికంగా వాహనాలను ఏర్పాటు చేసి ఓటర్లను తరలించడం ఇది మొదటిది కావచ్చు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఓటర్లను ఇబ్బంది గురి చేసే విధంగా విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోకుండా వదిలివేస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మరిన్ని జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. కాగా పోలింగ్ కేంద్రాల తారుమారు పై విభిన్న కథనాలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల సూచన మేరకే స్పీకర్ పోలింగ్ కేంద్రాల వరుస సంఖ్యను తారుమారు చేయించి ఉండవచ్చునని వ్యాఖ్యానించారు. వికారాబాద్ మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవడానికి ఇది ఒక ఎత్తుగడ కావచ్చునని అభిప్రాయపడ్డారు. పోలింగ్ కేంద్రాల మార్పు వెనుక గూడుపుఠాణి జరుగుతుండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా 3000 మంది ఓటర్ల మాత్రం ఓటు హక్కు వినియోగించుకోవడానికి పగలే చుక్కలు చూడవలసిన పరిస్థితి నెలకొంది. ఈ ఓటర్లకు అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారో వేచి చూడాల్సిందే...

## సజావుగా ఎన్నికల నిర్వహణ..



తాండూరు, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : నేడు జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిది లో సేంట్ మర్ప్ జూబ్లీ పాఠశాల నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కలెక్టర్ పరిశీలించారు.నేడు జరగనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను ,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణి ని పరిశీలించారు.పాఠశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి. పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.36 వార్డు లకు గాను 117 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్ లు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రి బ్యా షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు.ఎక్కడ కూడా డబల్ ఓటింగ్ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని.విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు.ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్ల వారీగా బస్సు లు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ తారసింగ్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అధికారులు, ఇతర సిబ్బంది పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లోనీ 77 వార్డుల్లో 189 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అధికారులకు సహకరించేందుకు రిటర్నింగ్, జోనల్ అధికారులు, మున్సిపల్, పోలీస్ యంత్రాంగం ఇతర సిబ్బంది కలిపి సుమారు 2000 మంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్ల లో, వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి కూడా పోలింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పోలింగ్ అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఏమైనా సమస్యలు వస్తే వెంటనే జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి



అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తును నియమించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ఆయా విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూట్లవారీగా గద్వాల మున్సిపాలిటీలోని 37 వార్డులకు సంబంధించి ఏర్పాటుచేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారులు తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రీసైడింగ్ అధికారులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. స్పెషల్ కౌంటర్లో బ్యాలెట్ పేపర్స్‌తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను, కవర్లను, ఇతర సామాగ్రిని పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత పోలింగ్ స్టేషనులకు మెటీరియల్ తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు. ప్రీసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సాయంత్రంలోగా తమకు కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రానికి వచ్చే ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు రిటర్నింగ్ అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలోనే ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమును ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాటుచేసిన నాలుగు హాల్స్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎస్పి మొగిలయ్య, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ మల్లికార్జున్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమామహేశ్వరంలో 22 ఏళ్లుగా వనపర్తి ఎమ్మెల్యే అన్నదానం



**అచ్చంపేట, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం ఉత్తర ముఖ ద్వారంగా బాసిల్లుతున్న శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శివరాత్రి పర్వదినం సందర్భంగా నాలుగు రోజులు పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే సతీమణి శారద రెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డిలు ఉమామహేశ్వరం లోని శివుడికి పలాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం పాల్గొని మన్సూర్, లక్ష్మారెడ్డి, విజయసింహారెడ్డి బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా తూడి శారదా రెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వర స్వామి ఎంతో మహిమగల స్వామి అని కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామిని కొలుస్తారని చెప్పారు. గత 22 ఏళ్లుగా ప్రతి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు తో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



**తూప్రాన్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మున్సిపల్ సాదారణ 2వ ఎలెక్షన్స్-2026 ప్రక్రియలో బాగంగా ఈ రోజు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఎన్నికల సామాగ్రిని 32 పోలింగ్ బూత్ లకు పంపించి నట్లు తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి తెలిపారు, ఎన్నికల కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అబ్జర్వర్ .రవి కిరణ్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు సందర్శించారు మహేందర్, అదనపు ఎస్పీ మహేందర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కి విచ్చేసి ఎన్నికల అధికారులు సుమారు 200 మందితో సమావేశం నిర్వహించి ఎన్నికలు సజావుగా జరుపుటకు గాను ఎన్నికల నిర్వాహణ నియమాలను సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, ఆర్డీవో జై చంద్ర రెడ్డి తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ సత్యనారాయణ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ గంగరాజు లు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రశాంతంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం మెదక్ జిల్లా కేంద్రంలోని వెస్లీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ళను సైతం పరిశీలించిన కలెక్టర్, సీ.సీ టీవీలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉండాలన్నారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. అనవసర




తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి




**మల్దకల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారంమల్దకల్ ఎంపీడీవో ఆఫీస్ అటెండర్ బజారన్నకు సమ్మె నోటీస్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సి హనుమంతు మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశవాపిత సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ పూర్తిమద్దతు ఇవ్వడం జరిగింది.కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఆర్థిక పాలసీ విధానాల వల్ల ప్రజలు కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక్కరోజు సమ్మెను విజయవంతం కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా జిల్లా అధ్యక్షుడు హరీష్,గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు భీమన్న,గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** పురపాలక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్పీ మంగళవారం సాయంత్రం గద్వాల పట్టణంలో ఉన్న పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా గంజిపేట పరిధిలోని మౌంటేశ్వరి స్కూల్,వేదనగర్ లోని దయానంద విద్యా మందిర్,రాఘవేంద్ర కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, ఎమ్.ఏ.ఎల్.డి.జూనియర్ కాలేజ్ తదితర పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు,సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. అవసరమైన చోట మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

వివిధ పోలింగ్ స్టేషన్ల దగ్గర డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని జిల్లా ఎస్పీ డీఎస్పీ గద్వాల వై. మొగిలయ్య తో చర్చించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సమయానికి భోజనం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని గద్వాల టౌన్ ఎస్సైని ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీతో పాటు గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల సర్కిల్ ఆఫీసర్ టంగుటూరి శ్రీను,పట్టణ ఎస్సై కళ్యాణ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**మిడ్జిల్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** ఇటీవల ఆన్లైన్ మోసాలకు అమాయక ప్రజలు బలవుతున్నారని. సైబర్ నెరగాలతో జాగ్రత్తగా ఉండాలని ఏపీజీవిబీ బ్యాంక్ మేనేజర్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలో ని దోనూరు గ్రామంలో ఆర్థిక సాంకేతిక కార్యక్రమంలో భాగంగా ధోని గ్రామంలో రైతులకు మహిళా సంఘాల సభ్యులకు. బ్యాంకు ఖాతాదారులకు ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖాతాదారులు కేవైసీని అప్డేట్ చేసుకోవాలని. కొత్త వ్యక్తుల నుండి ఏవైనా ఫోన్ లింకులు వస్తే ఓపెన్ చేయకూడదని. ఓటిపిలు చెప్పకూడదని. సూచించారు. బ్యాంకు రుణాలను లబ్ధిదారులు సకాలంలో చెల్లించి. బ్యాంకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ ను కట్టుకోవాలని. బ్యాంకులో 20 రూపాయల నుండి మొదలుకొని మూడు వేల రూపాయలకు ఇన్సూరెన్స్ కట్టుకుంటే 60 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు అందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు. డిఓ జీబి అధికారి జగన్మోహన్. ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ గ్రామ ప్రజలు ఖాతాదారులు పాల్గొన్నారు.

# ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శించిన ఎస్పీ

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** జిల్లాలో గద్వాల, అయిజ,వడ్డేపల్లి, అలంపూర్ పట్టణ పురపాలక సంస్థల ఎన్నికల సందర్భంగా గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన గద్వాల పట్టణ పురపాలక సంస్థ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు,సిబ్బందికి సమగ్రంగా బ్రీఫింగ్ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ పాత్ర అత్యంత కీలకమని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు,అలాగే పోలింగ్ సామగ్రి తరలింపు సమయంలో పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం,సెక్టార్, రూట్,పట్రోలింగ్ బృందాల బాధ్యతలు స్పష్టంగా ఉండాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని,అలాగే పై అదికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకారం అందించాలని, ఓటర్లు భయపడకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీస్ శాఖదేనని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని తెలిపారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో గుంపులుగా గుమికూడరాదని చెప్పారు. 09-02-2026 సాయంత్రం 5.00 గంటల నుండి పోలింగ్ పూర్తయ్యే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో సభలు, సమావేశాలు, ప్రచారం, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్లు పూర్తిగా నిషేధమని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బూత్‌లకు అనుమతి లేదని, ఒక్క టేబుల్ మాత్రమే ఏర్పాటు చేయాలని తెలిపారు. చీటీలపై అభ్యర్థి పేరు, గుర్తు లేదా పార్టీ పేరు ఉండకూడదని, కేవలం వార్డు నెంబర్, ఓటరు క్రమ సంఖ్య మాత్రమే ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రం మరియు పరిసరాల్లో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమన్నారు. ఎన్నికల భద్రత దృష్ట్యా 09-02-2026 సాయంత్రం 5.00 గంటల నుండి 12-02-2026 ఉదయం వరకు మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేయబడతాయని, అక్రమ మద్యం కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలని,ఇతర వస్తువులు తీసుకురాకూడదని, ఓటు వేసిన వెంటనే గుమిగూడకుండా తమ నివాసాలకు వెళ్లాలని ఆదేశించారు. నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 77 వార్డులలో 189 పోలింగ్ కేంద్రలలో మున్సిపాలిటీ ఎన్నికలు జరగనుండగా, వాటిలో 105



సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను ఉండగా దీనికి గాను 15 రూట్ మొబైల్ పార్టీలు, 4 స్ట్రైకింగ్ ఫోర్స్, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లు, 7 క్యూ ఆర్.టి.లు, 15 రూట్ ఇంచార్జ్‌లుగా మున్సిపాలిటీ ఎన్నికలకు 375 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి.ఎమ్. సంతోష్ తో పాటు జిల్లా ఎస్పీ గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ స్ట్రాంగ్ రూముల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## చిరుతపులి సంచారం వాస్తవమే..

- జాగ్రత్తగా ఉండాలి
- అటవీ శాఖ సెక్షన్ అధికారి రమేష్



**అల్లాదుర్గం, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** అల్లాదుర్గం మండలంలో చిరుతపులి సంచరిస్తుందన్న విషయం వాస్తవమేనని శంకరంపేట్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేష్ కుమార్ అన్నారు.మంగళవారం అటవీ శాఖ అధికారులు చిరుత సంచరిస్తున్న ప్రదేశాలను పరిశీలించి,ఆన వాళ్ళను గుర్తించారు. అనంతరం సమీప తాండా ప్రజలకు పలు సూచనలు చేస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. గొల్ల కుంట తండా సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఆ చిరుత వెళ్లినట్లు వారు గ్రహించారు. కనుక గొర్ల కాపరులు ,వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు, గ్రామస్తులు ,అటువైపు వెళ్ళకూడదని ఆయన సూచించారు. మండలంలో చిరుత పులి సంచరిస్తున్న విషయం వాస్తవమేనని సమీప గ్రామ ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. మరోసారి చిరుత కనిపిస్తే సమాచారం అందించాలని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ మనస్విని,సర్పంచ్ మాన్యా నాయక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పూజా స్టోర్ దగ్ధమవడం దురదృష్టకరం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలోని కాళేశ్వరం రోడ్డులో మహేశ్వర పూజా స్టోర్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం కావడం దురదృష్టకరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. షార్ట్ సర్క్యూట్ తో బుక్క దుకాణం పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత వ్యాపారిని పరామర్శించారు. ధైర్యం చెప్పారు. ఈ ప్రమాదం దురదృష్టకరమన్న ఎమ్మెల్యే, ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అగ్నిప్రమాదాల పట్ల వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మున్సిపాలిటీ ఎన్నికకు పోలీసు పకడ్బందీ ఏర్పాట్లు

- 1000 సిబ్బందితో పోలీసు బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్, 144 సెక్షన్
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు జిల్లా పోలీసు ఆద్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్బంగా ఎస్పి మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులలో ఎన్నికలు జరగనుండగా, అందులో 14 రూట్లుగా విభజించి, 62 పోలింగ్ లొకేషన్స్ మరియు 216 పోలింగ్ బూత్ లు ఉన్నాయి. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఎస్పీ స్వయంగా పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, ప్రజలను ఓటు హక్కు పై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురి కాకూడదని ప్రజలకు సూచించారు. ఈరోజు నుండి పోలింగ్ స్టేషన్లో పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమిగూడి ఉండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని, ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే వారిని 200 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ బందోబస్తులో 53 మంది ఫారెస్ట్, టిజిఎస్పి, ఏసీబీ, జైళ్ల శాఖ, లీగల్ మెట్రాలజీ, ఎలక్ట్రిసిటీ, ఆర్టిసి, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలలో 35 క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా 40 సీఐ మరియు ఎస్ఐ స్థాయి అధికారులచే స్టాటిక్ ఫోర్స్ తో మరియు స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు ప్రక్రియలో పోలింగ్ స్టేషన్లో, 14 రూట్ మొబైల్స్ లో, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో ముగ్గురు అదనపు ఎస్పీలు, 3 డిఎస్పీలు, 21 మంది సీఐలు, 48 ఎస్సై లతో, మహిళా సిబ్బంది, హోంగార్డ్స్, రిజర్వు సిబ్బంది, సాయుధ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 10 వార్డులకు ఒక అదనపు ఎస్పి, డిఎస్పి స్థాయి అధికారులచే ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

## పరకాలలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్
- పరకాలలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎంతమంది పిఓలు, ఏపీవోలు ఓపివోలు, మైక్రో అబ్జర్వర్లు హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రొజెక్టర్ స్క్రీన్ పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. రేపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1100 పైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డిసిపిలతో పాటు ఐదుగురు అదనపు డిసిపిలు4మంది, ఏసిపిలు 11మంది, ఇన్స్పెక్టర్లు 125 మంది, ఎస్.ఐలు 113 మంది, ఏ.ఎస్.ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు 515, హోంగార్డ్స్ 226 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సుమారు 168 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని. ఎన్నిక వేళ అదనపు డిసిపి స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మున్సిపల్ పరిధిలో ఒక ఏసిపి స్థాయి అధికారిని ఇంచార్జ్‌గా వుంటారని. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్.ఐ/ఏ.ఎస్.ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడు తున్నట్లుగా సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని ప్రజలకు సూచించారు.



### మున్సిపల్ ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. బైంసాలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనరల్ అబ్జర్వర్ వీరా రెడ్డి పోలింగ్ రోజు నిర్వహణ కీలకమని, శాంతియుత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ పోలింగ్ అనంతరం సామగ్రి అప్పగింత నిబంధనల ప్రకారం జరగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, మున్సిపల్ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి అంబేద్కర్ స్టేడియంలోని బ్యాలెట్ బాక్స్ లు నిల్వచేయడానికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఓట్లు లెక్కింపు కొరకు ఏర్పాటు చేయనున్న సింగరేణి మినీ ఫంక్షన్స్ హాల్ ను పరిశీలించి కౌంటర్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీలో 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఓటర్లు నిర్భయంగా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకావాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పిఓలు, ఏపీవోలు, ఓపివోలు కు ఎన్నికల నిబంధన ప్రకారం శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** ములుగు కొత్త మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 11 తేదీన జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో ఓటర్ స్లిప్పుతో పాటు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా వెంట తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ అనుమతించిన గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ గుర్తింపు కార్డు,ఆధార్ కార్డు,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్టాఫీస్,బ్యాంక్ పాస్‌బుక్,కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్,పాన్ కార్డు,ఫోటోతో కూడిన ఎస్సీ / ఎస్టీ / బీసీ కుల ధృవీకరణ పత్రాలు. భారతీయ పాస్‌పోర్టు,ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు,ఎంపీ / ఎమ్మెల్యే / ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు,పట్టాదార్ పాస్ పుస్తకం,రేషన్ కార్డు,ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్, స్వాతంత్ర్య సమరయోధుల ఐడీ కార్డు, ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డు,పై గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి చూపించి ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ దివాకర టి.ఎస్.కోరారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహణకు జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్సెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారుల బృందాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్‌కెసిఓఎ క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ రోజున వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వ్యాసార్థం నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు.

### రూ.92 లక్షల నిధులతో భూమి పూజ

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**బాసర, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర మండలఆలోని పలు గ్రామాల్లో అభివృద్ధికి రూ.92 లక్షల నిధులతో మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమి పూజ చేశారు. బాసర మండల కేంద్రంలోన రూ.20 లక్షల నిధులతో డ్రెయినేజీ నిర్మాణం, రెండు అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు, అలాగే రూ.21 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామంలోని ఆలయ ఆవరణలో రూ.7 లక్షల నిధులతో త్రాగునీటి పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కిర్గుల్--కే గ్రామంలో పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా రూ.10 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి, అలాగే మహిళల సంక్షేమం కోసం రూ.10 లక్షల నిధులతో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## ఇచ్చిందే తీసుకెళ్లు...

- పాలకుర్తిలో గ్రోమోర్ సిబ్బంది ఇష్టారాజ్యం

**పాలకుర్తి ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** పంట పొలానికి కావలసిన పురుగుల మందు (గడ్డి మందు) కొనుగోలు చేసేందుకు వెళ్లిన రైతును గ్రోమోర్ కేంద్రం సిబ్బంది మోసం చేసిన వైనం. వివరాలలోకెళ్తే.... లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన రైతు బక్కగట్టయ్య గడ్డి మందు కొనుగోలు చేసేందుకు మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రానికి వెళ్లాడు. తమకు కౌన్సిల్ యాక్టివ్, నామినీ గోల్డ్, పురుగు మందులు కావాలని వెళ్లగా. ఆ కంపెనీకి చెందిన పురుల మందు ఉన్నప్పటికీ అది ఇవ్వకుండా మా దగ్గర లేదని బుకాయిం చారు.బయట ఎక్కడైనా కొనుగోలు చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. ఈ కంపెనీకి చెందిన పురుగుల మందు పనిచేయదని. మేము ఇచ్చిన మందు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తనకు కావాల్సిన మందును కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ షాప్ కి వెళ్ళాడు. తనకే కాకుండా మండలంలోని రైతులందరినీ గ్రోమోర్ సిబ్బంది మోసం చేస్తుందని విమర్శించారు. ఇంత జరుగుతున్న వ్యవసాయ శాఖ కనుసన్నల్లోనే గ్రోమోర్ సిబ్బంది పనిచేస్తుందని ఆరోపణలు లేకపోలేదు. రైతులు అడిగిన ఎరువులను పురుగుల మందులను గ్రోమోర్ యజమాన్యం ఇచ్చే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గ్రోమోర్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం పై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనిని వివరణ కోరగా, రైతులు అడిగిన ఎరువులు పురుగుల మందులను గ్రోమోర్ యజమాన్యం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులకు ఇవ్వకుండా మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోండి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- స్పెషల్ పార్టీ బలగాల ర్యాలీ



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి);** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ, అబ్దుల్లా చౌక్, ఖానాపూర్, అంబేద్కర్ నగర్, కాలనీలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో విస్తృత ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో 100 మంది స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు, సిబ్బంది పాల్గొని ప్రధాన వీధుల్లో మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను విజయవంతం చేయడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే సోషల్ మీడియా వేదికలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేయరాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు బి సునీల్ కుమార్, ఎం ప్రసాద్, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
11 ఫిబ్రవరి 2026

# స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల వేళ తప్పుడు సమాచారం ప్రచారం చేయవద్దు
- సోషల్ మీడియాపై నిఘా ఉంచాం
- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా 1250 పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.నరసింహ మంగళవారం తెలిపారు.ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం పోలీసు లక్ష్యం అన్నారు.ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలే తప్ప డబ్బు, మద్యం, బహుమతులు అంటూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని అన్నారు.ఓటర్లు కాని వారు ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీలలో ఉండకూడదని పేర్కొన్నారు.ఎన్నికల నియమావళి పట్ల, ఓటు హక్కు పట్ల ఎన్నికల ప్రాముఖ్యత పట్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఓటర్లు, అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని కోరారు.ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేవారు వరుస క్రమంలో నిల్చుని వారి ఓటును ఉపయోగించుకోవాలని, వృద్ధులకు, దివ్యాంగులకు ఓటు హక్కు ముందుగా వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా చేరవద్దని,100 మీటర్ల పరిధిలో ఓటు వేయమని అభ్యర్థించవద్దని,200 మీటర్ల పరిధి టెంట్లు ఏర్పాటు, కరపత్రాలు పంచడం, గుర్తులు చూపడం లాంటివి చేయవద్దని అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ఇబ్బందులు పెట్టడం, ప్రలోభాలు గురి చేయడం లాంటివి చేయకూడదని తెలిపారు.అపోహలు సృష్టించకుండా, తప్పుడు సమాచారం, ప్రచారం చేయకుండా ఉండాలన్నారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీస్ శాఖ నిశిత పరిశీలన ఉందని, ఎవరైనా ఎన్నికల విధానానికి అటంకం కలిగించేలా ప్రవర్తించిన తప్పుడు సమాచారం ప్రచారం చేసిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే భవిష్యత్తులో ఎన్నికల వచ్చే ప్రతిసారి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.యువత ఆదర్శంగా ఉండాలని కోరారు.విజయోత్సవ ర్యాలీలకు బాణాసంచాకు, డీజేలకు అనుమతి లేదన్నారు.ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంగించినట్టయితే చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఎన్నికలకు ఐదు అంచల పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు.పోలింగ్ బూతుల వద్ద, పోలింగ్ లొకేషన్ ల వద్ద, 100 మీటర్ల పరిధి, 200 మీటర్ల పరిధిలో, స్ట్రైకింగ్ ఫోర్సు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎన్నికల నియమావళి అమలు టీమ్స్, రూట్ మొబైల్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు అన్నారు.పోలింగ్ కేంద్రాలలో ఆన్లైన్ వెబ్ కాస్టింగ్ ఉంటుందని తెలిపారు.ఆన్ లైన్ ద్వారా ఈ కేంద్రాలలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.సీసీ కెమెరాలతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**చొప్పదండి, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను మున్సిపాలిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే రూట్, మానిటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని ఆదేశించారు. చొప్పదండిలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితుల అరెస్ట్



**చంద్రుగొండ, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి మీడియాకు కొత్తగూడెం డిఎస్పి వివరాలు తెలియజేశారు. తల్లాడ ఏనుకూరు జూలూరుపాడు చంద్ర గుండా అన్నపురెడ్డిపల్లి మండలాల పరిధిలోని తాళాలు వేసుకున్న ఎల్లనే లక్ష్యంగా చేసుకొని వాటిని పగలగొట్టి ఎల్లోకి ప్రవేశించి బీరువాలు పగలగొట్టి నగదు బంగారం వెండి ఆభరణాలు దొంగతనం చేస్తున్న వారిని చంద్రుగొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ నకిలీ కరెన్సీ నోట్లు చలామణి చేయాలని యత్నించిన నలుగురు నిందితులను మంగళవారం నేషనల్ హైవేపై వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనించగా వారు పారిపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకొని విచారణ చేశారు. ఈ విచారణలో వారు నకిలీ 500 నోట్లను కొనుగోలు చేసి వాటిని కొత్తగూడెం చంద్రుగొండ గుంటూరు ప్రాంతాలలోని షాపుల్లో చలామణి చేసి అసలు నోట్లు గా మార్చి ప్రజలను మోసం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నిందితుల నుండి మూడు లక్షల 50 వేల విలువైన నకిలీ 500 నోట్లు, 50వేల విలువైన అసలు నగదు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు నకిలీ కరెన్సీ నోట్ల పట్ల అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని తెలియజేశారు. గుంటూరుకు చెందిన చల్లా సురేష్ గోరంట్ల గ్రామం చెందిన జల్లేపల్లి వెంకటేశ్వరరావు హైదరాబాదు చెందిన బండారి వంశీ ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలానికి చెందిన గాదె నాగరాజులు ను అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ లక్ష్మి చంద్రుగొండ జూలూరుపాడు అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన ఎస్సైలు శివరామకృష్ణ, రవి, జై సింహా రెడ్డి సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల బందోబస్తు విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- క్రమశిక్షణతో వ్యవహరించాలి
- జిల్లా ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** నేడు జిల్లాలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి సూర్యాపేట పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు విధులు నిర్వహణపై పోలీసు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని తెలిపారు.బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలని,అనుమతి లేని వ్యక్తులను ఓటరు కాని వారిని పరిసరాల్లో రానివ్వద్దని తెలిపారు.100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఓటర్లు సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తెస్తున్నారా అనే దానిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.ఎన్నికల సామాగ్రి తరలించడంలో రూట్ మొబైల్ పోలీసు సిబ్బంది విధులు ముఖ్యమైనవని చెప్పారు. ఎన్నికల సామాగ్రికి పూర్తి భద్రత కల్పిస్తూ పోలింగ్ సామగ్రిని పోలింగ్ బూత్ లకు చేర్చడం, స్ట్రాంగ్ రూమ్ లకు తరలించడంలో అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న, ఇబ్బందులు వచ్చినా, ఎవరైనా గొడవలు పడినా, గుంపులుగా చేరినా సంబంధిత స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందికి, రూట్ మొబైల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.విధుల నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు లేదా ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వాటిని వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమష్టి బాధ్యత అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పీ ప్రసన్నకుమార్, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, రామారావు, శివకుమార్, ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలి



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది యొక్క ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై ఎదులాపురం మున్సిపాలిటీ సంబంధించి ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని,ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు.అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, చెక్ పోస్టులు, రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన వుండాలన్నారు. ఎక్కడ కూడ ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. అడిషనల్ డీసీపీలు -04, ఏసీపీలు -08, సిఐలు - 25, ఎస్సైలు - 80, పోలీస్ సిబ్బంది - 975 కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏసీపీ తిరుపతి రెడ్డి, నర్సయ్య, రూరల్ డివిజన్, సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**కాప్రా, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** కాప్రా సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లో అభివృద్ధి పనులను మంత్రి శ్రీధర్ బాబు,స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ల బొంతు శ్రీదేవి యాదవ్ ప్రభుదాసులతో కలిసి ఆయన ప్రారంభించారు.కలిసి చర్లపల్లి డివిజన్లో రూ.19 కోట్ల 36 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, మీర్పేట్ హెచ్.బీ కాలనీలో 9 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ డివిజన్ సమస్యలను పరిష్కరిస్తూ, సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. రూ.3.75 కోట్లతో డీమార్ట్ రోడ్ మీదుగా పోచమ్మ ఆలయం వరకు, అక్కడి నుంచి కృష్ణారెడ్డి నగర్ ఆర్చ్ వరకు ఆర్ సి సి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం. రూ.2.85లక్షలతో సాయినగర్ ఆర్చ్ నుంచి శిఫర్ కంపౌండ్ వాల్ ఉ కృష్ణారెడ్డి నగర్ రోడ్ నెం.1, 2 వరకు ఆర్ సి సి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం. రూ.3.13 కోట్లతో శ్రీ సాయి వెంకట్ ఎన్క్లేవ్, శివ సాయి నగర్, శ్రీనివాస ఎన్క్లేవ్, వి ఎన్ రెడ్డి నగర్, సుభోదయ కాలనీ, నాగార్జున నగర్, సోనియా గాంధీ నగర్, వైష్ణవి ఎన్క్లేవ్, సాయి కృష్ణ నగర్, ఇందిరా నగర్, నెహ్రూ నగర్ లలో సీసీ రోడ్ల నిర్మాణం. రూ.1.26 కోట్లతో జె ఎన్ ఆర్ అపార్ట్మెంట్స్ నుంచి శివ సాయి గార్డెన్స్ వరకు 600 మిమీ వ్యాసం గల ఆర్ సి సి ఎన్ పి 3 పైపు డ్రెయిన్ నిర్మాణం. రూ.5.50 కోట్లతో చిన్న చర్లపల్లి వార్డు నెం.03 లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సమాధి స్థలాల మోడల్ గ్రేవ్యార్డ్ అభివృద్ధి. రూ.2.87 కోట్లతో లోకమాత కాలనీ, విద్యా మారుతి కాలనీ, ఐజి కాలనీ, శివ సాయి నగర్, అంబేద్కర్ నగర్, జ్యోతి నగర్, మధుసూదన్ రెడ్డి నగర్‌లలో సీసీ రోడ్ల నిర్మాణం. అనంతరం కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ కార్పొరేటర్ గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఈరోజు చివరి రోజు అవడంతో ఈ యొక్క ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు మంజూరు చేసే ప్రక్రియలో ముఖ్యపాత్ర పోషించిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కి , ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం నా పదవీకాలంలో నా విజయంగా భావిస్తున్నా చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం మంత్రి కి బండివాని నమూనా డిజైన్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రాజెక్టు డిజైన్ వివరాలు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు పర్వాదం పావని మణిపాల్ రెడ్డి,గుండారపు శ్రీనివాస్ రెడ్డి వివిధ పార్టీ నాయకులు వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికిఎన్నికల సామాగ్రి పంపిణీ



**కల్లూరు, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల సామాగ్రిని అధికారులు మంగళవారం పంపిణీ చేశారు. కల్లూరు లోని ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, స్థానిక తాసిల్దార్ పులిసాంబశివుడులతోకలిసిపరిశీలించారు. ఓటర్లకు మెటీరియల్ను సెంటర్లో ఉన్న పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రి సరిగ్గా అమర్చబడి ఉన్నాయో లెక్కలు కరెక్ట్ గా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు.కల్లూరు మున్సిపాలిటీ మొత్తం వార్డులు 20 ఎన్నికల నిర్వహణకు సంబంధించి 40 పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల నిర్వహణ సంబంధించి మూడు జోన్లు , నాలుగు రూట్లుగా ఏర్పాటుచేసే -256 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఎన్నికల సిబ్బందితో మాట్లాడి, పంపిణీ ప్రక్రియలో అనుసరించవలసిన పలు మార్గదర్శకాలను , సూచనలను చేశారు. చేశారు. ఎన్నికల ప్రక్రియ ఎటువంటి అక్రమాలు జరుగకుండా సజావుగా జరిగే విధంగా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికలు పోలింగ్ సాఫీ సమర్థవంతంగా నిర్వహించి ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఫలితాలు వచ్చేలా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ ఏ.రామ దుర్గారెడ్డి, ఎన్నికల ప్రత్యేక అధికారి చలపతిరావు, ఎంపీఓ కృష్ణ, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాని పరిశీలించిన జిల్లా ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని జంగిడి గద్ద కాలనీ, 11వ వార్డు, శివాజీ నగర్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి భద్రతాపరమైన పలు కీలక సూచనలు చేశారు. పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎస్పీ మాట్లాడుతూ.పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్ర పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుంపులపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లు సక్రమంగా నిర్వహిస్తూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు.అలాగే పోలింగ్ కేంద్రం లోపల, బయట సరైన బందోబస్తు ఏర్పాటు చేయడం, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ, వాహనాల నియంత్రణ, అనవసర వ్యక్తుల ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఎస్పీ తో పాటు ఎస్సై వెంకటేశ్వర్లు, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలి
- ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- ఏదైనా గుర్తింపు కార్డుతో పోలింగ్ బూత్ కు రావాలి
- ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని,ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.జిల్లాలో సూర్యాపేట,కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు.నేడు ఎన్నికలు జరుగనున్న సందర్భంగా పోలింగ్ బూతుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చే సమయంలో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి అనగా ఓటర్ కార్డు,ఆధార్ కార్డు,ఉపాధి హామీ జాబ్ కార్డు,ఫోటో కూడిన పోస్ట్ ఆఫీసు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు,లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్ పోర్టుతో జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, అధికారిక గుర్తింపు కార్డులు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని సూచించారు. ఓటర్లు ఓటు హక్కును నూరు శాతం వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పాటును అందించాలన్నారు.జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 141 వార్డులలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. పోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 446 పోలింగ్ అధికారులు, 446 ఏపిఓ, 1340 ఓపిఓలను నియమించినట్లు తెలిపారు.ఎన్నికల సజావు నిర్వహణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు నియమించామన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు 10 ఎస్ఎస్టీ, 15 ఎఫ్ఎస్టీ, 7 వీవీటీ, ఏటీ 7 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీదారుల వ్యయ నియంత్రణకు 5 గురు ఏఈఓలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. 55 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్ కు తరలింపుకు 46 బస్సులను సిద్ధం చేసినట్లు, పోలీస్ ఎస్కార్టుతో బందోబస్తు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛ, న్యాయబద్ధంగా జరిగేలా అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్,ఎస్పీ జనరల్ అబ్జర్వర్ పాండదాస్ తో కలిసి ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్ను పరిశీలించారు.వీరి వెంట ఆర్డీఓ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,జిల్లా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద..

## ఈక్విటీలతో సమానంగా

**న్యూఢిల్లీ:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో నికరంగా రూ.24,028 కోట్లు మాత్రమే వచ్చాయి. అంతకుముందు నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 14 శాతం తగ్గుముఖం పట్టింది. ఈక్విటీల్లోకి పెట్టుబడులు తగ్గడం వరుసగా ఇందో రెండో నెల. మార్కెట్ పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడం ఇందుకు కారణం. అదే సమయంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి భారీగా పెట్టుబడులు తరలిరావడం విశేషం. ఈ మేరకు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ (ఒఓఈఎ) జనవరి నెలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది.యాంఫీ డేటా ప్రకారం.. మ్యూచువల్ ఫండ్ల సంస్థల (ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ పెరిగింది. డిసెంబర్ రూ.80.23 లక్షల కోట్లుగా ఉన్న ఈ విలువ రూ.81.01 లక్షల కోట్లకు చేరింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ నుంచి డిసెంబర్‌లో రూ.66,591 కోట్ల నిధులు తరలిపోగా.. జనవరి నెలలో వివిధ కేటగిరీల్లో నికరంగా రూ.1.56 లక్షల కోట్ల నిధులు వచ్చాయి. ఈక్విటీ స్కీమ్స్‌లో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.7,672 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,185 కోట్లు, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,182 కోట్లు చొప్పున నిధులను ఆకర్షించాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,005 కోట్లు రాగా.. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,942 కోట్లు నిధులొచ్చాయి. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ (ఇఓూా) నుంచి రూ.593.69 కోట్లు తరలిపోయాయి. మదుపర్ల నుంచి ప్రాఫిట్ బుకింగ్, ట్యాక్స్ సంబంధిత అడ్జెస్ట్‌మెంట్ల వల్ల ఈ పరిస్థితి నెలకొందని యాంఫీ పేర్కొంది. ఇదే నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.74,827 కోట్ల నిధులు వచ్చాయని తెలిపింది. గోల్డ్ రష్: బంగారం ధరల్లో భారీ పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు భారీగా తరలివచ్చాయి. డిసెంబర్ నెలలో రూ.11,647 కోట్ల పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రాగా.. జనవరిలో రూ.24,040 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అంటే నెలవారీగా చూసినప్పుడు నిధులు రెట్టింపయ్యాయి. దాదాపు ఈక్విటీ పెట్టుబడులతో సమానంగా ఈ కేటగిరీలోకి నిధులు తరలివచ్చాయి.





# వాణిజ్య ఒప్పందంతో మార్కెట్లకు బూస్ట్

- రూ.6.03 లక్షల కోట్లు పెరిగిన కంపెనీల మార్కెట్ విలువ
- ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.2,254.64 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.4.15 కోట్లు



**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో టారిఫ్ అనిశ్చితులు సమసిపోయి దేశీయ మార్కెట్లలో జోష్ కనిపించింది. ఎఫ్ఐఐలు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడం కలిసొచ్చింది. పీఎస్‌యూ బ్యాంకులు ఊహించిన దాని కంటే మంచి పని తీరు కనబరుస్తుండటంతో పీఎస్‌యూ బ్యాంక్ సూచీ రాణించింది. ఫలితంగా వరుసగా రెండో రోజూ దేశీయ సూచీలు రాణించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఒక పైసా నష్టపోయి 90.66 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.81 శాతం తగ్గి 67.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు కూడా ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.03 లక్షల కోట్లు పెరిగి, రూ.473.34 లక్షల కోట్ల (5.24 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,177.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,580.40 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 83,860.42 పాయింట్ల కనిష్ఠాన్ని తాకినా, 84,314.68 పాయింట్ల గరిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. చివరకు 485.35 పాయింట్ల లాభంతో 84,065.75 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 173.60 పాయింట్లు లాభపడి 25,867.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,922.25-25,780.90 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. ఎస్‌బీఐ 7.46%, టైటన్ 2.78%, టాటా స్టీల్ 2.56%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.52%, ఎటర్నల్ 1.91%, బీఈఎల్ 1.85%, కోటక్ బ్యాంక్ 1.52%, ట్రెంట్ 1.30% చొప్పున పెరిగాయి. పవర్‌గ్రిడ్ 1.11%, ఐటీసీ 1.07%, ఎన్‌టీపీసీ 0.89%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.68%, ఇన్ఫోసిస్ 0.65% మేర నష్టపోయాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో జేకే టైర్ షేరు బీఎస్ఈలో 2.42% లాభపడి రూ.555.50 వద్ద స్థిరపడంది. ఇంట్రాడేలో ఒక దశలో 6.91% పెరిగి రూ.579.90 స్థాయిని కూడా తాకింది. డిసెంబరు త్రైమాసిక లాభం 90.36 శాతం పెరిగి రూ.416.29 కోట్లకు చేరడంతో, కల్యాణ్ జువెలర్స్ షేరు బీఎస్ఈలో 15.26 శాతం పెరిగి రూ.437.75 వద్ద ముగిసింది. దేశంలో అధిక గిరాకీ ఉన్న లాజిస్టిక్స్ హబ్‌లలో విద్యుత్ వాహన (ఈవీ) ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు జియో-బీపీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విద్యుత్ వాణిజ్య వాహన తయారీ సంస్థ యూలర్ మోటార్స్ వెల్లడించింది. యూనికార్న్ జెట్వెర్క్ ఎలక్ట్రానిక్స్ వ్యాపార అధిపతి జోష్ ఫౌల్గర్ కంపెనీకి రాజీనామా చేసి, దాని పోటీ సంస్థ డిక్సన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ పాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీఈపీఎల్)లో చేరారని నియంత్రణ సంస్థలకు సమాచారం అందింది. ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ బిజినెస్ ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా విపిన్ కపూరియా, మానవ వనరుల వైస్ ప్రెసిడెంట్‌గా యోగితా షాన్ బాగ్‌లను నియమించింది. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది.ఆయ్ ఫైనాన్స్ ఐపీఓకు మొదటి రోజు 12 శాతమే స్పందన లభించింది. ఫ్రాక్టల్ అనాలటిక్స్ ఐపీఓకు మొదటి రోజు 9 శాతం స్పందన లభించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక త్రైమా సిక లాభాన్ని నమోదు చేయడంతో, బీఎస్ఈలో షేరు 7.46 శాతం పెరిగి రూ.1,145.95 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో రూ.1,148 స్థాయిని కూడా తాకింది. ఇది 52 వారాల గరిష్ఠ స్థాయి కావడం విశేషం.

# అరబిందో ఫార్మా లాభం రూ.910 కోట్లు






**హైదరాబాద్:** ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 2025-26 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 7.6 శాతం వృద్ధితో రూ.910.29 కోట్లకు చేరింది. 2024-25 మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.845.81 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.7,978.52 కోట్ల నుంచి 8.4 శాతం వృద్ధితో రూ.8,646 కోట్లకు చేరింది. ఐరోపా మార్కెట్, యాంటీ రెట్రోవైరల్ విభాగాల్లో విక్రయాలు ఈ వృద్ధికి దోహదం చేశాయి. అమెరికా మార్కెట్‌లో రూ.3,729 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 9 ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. ఐరోపా ఆదాయం 27.4 శాతం పెరిగి, రూ.2,703 కోట్లకు చేరింది. ఏపీఐ వ్యాపారం 4.3 శాతం క్షీణించి, రూ.963 కోట్లకు పరిమితమైంది. విద్యుత్ ఖర్చుల ఆదాలో భాగంగా గరుడ రెన్యూవబుల్స్‌లో రూ.66 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా తన అనుబంధ సంస్థ ఆరో వ్యాక్సిన్స్‌ను మరో అనుబంధ సంస్థ క్యూరేటెక్ బయోలాజిక్స్‌తో విలీనం చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా పునీతా కుమార్ సిన్హాను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 'మా ప్రధాన మార్కెట్లైన అమెరికా, ఐరోపాలలో గిరాకీ నిలకడగా ఉంది. దీంతో ఈ త్రైమాసికంలో స్థిరమైన పనితీరు కనిపించింది. భవిష్యత్తులోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాం' అని సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానంద రెడ్డి వెల్లడించారు.

# వాట్సప్ వెబ్‌లో కొత్త ఫీచర్..

## యాప్ లేకుండానే కాల్స్


**న్యూఢిల్లీ:** ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సప్ తన వెబ్ వెర్షన్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. కొత్తగా వాయిస్, వీడియో కాలింగ్ ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో యూజర్లు ఎలాంటి అదనపు సాఫ్ట్‌వేర్ ఉపయోగించకుండానే నేరుగా వెబ్ నుంచే ఆడియో/ వీడియో కాల్స్ చేసుకోవచ్చు. యూజర్లు వ్యక్తిగత చాట్ విండోలో కాల్ బటన్ కనిపిస్తుంది. కొద్దిమంది యూజర్లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.వాట్సప్‌లో ప్రస్తుతం ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడాలంటే.. మొబైల్ యాప్ ఉండాలి. ల్యాప్‌టాప్/ పీసీలపై పనిచేసేవారైతే వాట్సప్ విండోస్ లేదా మ్యాక్ వెర్షన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇప్పుడు వాట్సప్ వెబ్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి వస్తోంది. ఎవరికైనా కాల్ చేయాల్సివస్తే ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేకుండా ఇకపై నేరుగా కాల్స్ చేయొచ్చు. పరిమిత సంఖ్యలో యూజర్లకు తీసుకొచ్చిన ఈ సదుపాయం త్వరలో అందరికీ రానుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ మాదిరిగా వాట్సప్ వెబ్ నుంచి చేసే కాల్స్‌కు కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది.




# ఏఐ టూల్స్‌తో ఉత్పాదకత పెరుగుతుంది

- 'సాఫ్ట్‌వేర్'కు ఇబ్బందేమీ లేదు
- ఆవిష్కరణలు వేగవంతమవుతాయ్
- నూతన ఉత్పత్తులకు నిపుణులు కావాల్సిందే




**న్యూఢిల్లీ:** సాఫ్ట్‌వేర్‌తో పాటు సాఫ్ట్‌వేర్ టూల్స్‌కు కృత్రిమమేధ (ఏఐ) సాంకేతికత, దాని ఆధారిత అధునాతన టూల్స్ ప్రత్యామ్నాయంగా మారతాయన్న అంచనాలు అంతర్జాతీయంగా పెరుగుతున్నాయి. ఐటీ కంపెనీల భవితకు పెను ముప్పు ముంచుకొస్తోందని, వాటిల్లో పనిచేసే లక్షల మంది నిపుణులకు పని లేకుండా పోతుందనే ఆందోళనలూ రేగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లు మరింత ఎక్కువగా స్పందిస్తున్నందున, ఐటీ కంపెనీల షేర్లు నష్టపోతున్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌కు వచ్చిన ఇబ్బందేమీ ఉండదనే భరోసాను గూగుల్, ఎన్‌విడియా వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల సీఈఓలతో పాటు.. ప్రస్తుత ఆందోళనకు కారణమైన ఆంత్రోపిక్ సంస్థ సహ వ్యవస్థాపకురాలే స్వయంగా విశదీకరిస్తున్నారు. 'వివిధ రంగాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ నిపుణులు చేసే పనులను' తమ అధునాతన క్లాడ్ కోవర్క్ ప్లాట్‌ఫామ్ స్వతంత్రంగా చేయగలదని అమెరికాకు చెందిన ఏఐ డెవలపర్ సంస్థ ఆంత్రోపిక్ ప్రకటించడం, ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంపై అమిత ప్రభావం చూపింది. 2030 కల్లా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభస్థాయి ఉద్యోగాలను సగం వరకు ఏఐతో భర్తీ చేయొచ్చని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొనడం సంచలనమైంది. ఇప్పటికే వినియోగిస్తున్న ఏఐ టూల్స్ కేవలం ఇచ్చిన డేటా నుంచి కావాల్సిన సమాధానాన్ని ఇవ్వడం, క్రమపద్ధతిలో అమర్చడం వంటివి చేస్తున్నాయి. అయితే ఆంత్రోపిక్ టూల్ మాత్రం కావాల్సిన సమాచారాన్ని కూడా అదే ఎంచుకుని, పనిని పూర్తి చేస్తుందని ప్రకటన వచ్చింది. చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఎన్‌విడియా సీఈఓ జెన్సన్ హాంగ్ మాత్రం సాఫ్ట్‌వేర్‌కు ఏఐ ప్రత్యామ్నాయం అవుతుందనే వాదనను తోసిపుచ్చుతున్నారు. ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ఆధారితంగానే ఏఐ పనిచేస్తుందని సిస్కో సిస్టమ్స్ నిర్వహించిన సదస్సులో జెన్సన్ వివరించారు. జనరల్ - ఆర్టిఫిషియల్ రోబో అయినా ఉన్న టూల్స్ వినియోగిస్తుందే కానీ, కొత్త టూల్స్ కనిపెట్టదని ఆయన పేర్కొన్నారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ నిపుణుల ఉత్పాదకత పెరుగుతుందని, వారు మరింత ప్రభావవంతంగా పని చేసేందుకు ఉపకరిస్తాయని చెబుతున్నారు. ఒకే తరహా పనులను మళ్లీమళ్లీ చేయాల్సిన అవసరం లేకుండా, ఆటోమేట్ చేయడానికి ఏఐ ఉపయోగ పడుతుందని బ్లూమ్‌బర్గ్ టెక్ సమావేంలో పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆటోమేషన్ వల్ల ఉద్యోగులు అవసరం ఉండకుండా పోవచ్చనే వాదనలు గత 20 ఏళ్లుగా వినిపిస్తూనే ఉన్నాయని.. అయితే ఏటా కొత్త ఉద్యోగాలు టెక్నాలజీ రంగంలో వస్తూనే ఉన్నాయని సుందర్ పిచాయ్ గుర్తు చేశారు. గూగుల్ కోడ్‌లో 30% ఏఐ నుంచే జరుగుతోందని, కొత్త ఉత్పత్తి ఆవిష్కరణను ఏఐ వేగవంతం చేస్తోందని సుందర్ పిచాయ్ వివరించారు. కొత్త ఉత్పత్తి కోసం మరింత మంది ఉద్యోగులు కావాల్సి వస్తారని విశ్లేషించారు. మనిషితో సమానంగా/అంతకంటే మెరుగ్గా కార్యకలాపాలను నిర్వహించే ఏఐ వ్యవస్థ అయిన ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) సాకారం చేయొచ్చా అన్న ప్రశ్నకు 'ఇప్పటివరకు దీనిపై ఎవరికీ స్పష్టత ఉందని నేననుకోను' అని సుందర్ పిచాయ్ బదులిచ్చారు.ఏఐ టూల్స్ అంతకంతకూ సమర్థంగా మారుతున్నందున, కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గుతోందని.. అయితే ఉద్యోగులకు కాదని ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకురాలు డేనియల అమోడెయ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సాహిత్యం చదివిన ఆమె, తదుపరి ఓపెన్‌ఏఐలో పనిచేసి, తదుపరి తన సోదరుడితో కలిసి ఆంత్రోపిక్‌ను ప్రారంభించారు. ఏఐ కంపెనీలు ఎలాంటి ఉద్యోగులను నియమించుకుంటాయో ఆమె వివరించారు. పూర్తిగా టెక్నాలజీ నైపుణ్యాలున్న వారి కంటే కమ్యూనికేషన్, కల్పనాశక్తి కలిగినవారికి, కొత్తవాటిపై అమితాసక్తి కనబరచేవారికి ఏఐ కంపెనీలు నియామకాల్లో ప్రాధాన్యమిస్తాయని వివరించారు. ఉద్యోగులను ఏఐ భర్తీ చేయనుందంటూ వచ్చిన వార్తలు పూర్తిగా అతిశయోక్తితో కూడుకున్నవని స్పష్టం చేశారు. 'మనుషుల ప్రమేయం లేకుండా, పూర్తిగా ఏఐ చేయగల పనులు అత్యంత స్వల్పం' అని ఆమె స్పష్టం చేశారు. మేము కూడా ఆంత్రోపిక్ కోసం ఉద్యోగులను నియమించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కమ్యూనికేషన్స్ సామర్థ్యాలు కలిగిన వారిని, భావోద్వేగాలను అర్థం చేసుకుని, ఉపయోగించగలిగిన వారిని, ఇతరుల పట్ల సానుకూల/దయార్ద్ర హృదయంతో స్పందించే వారికి ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణులు, ఏఐ కలిస్తే మరింత మెరుగైన ఉత్పాదకత లభిస్తుందని వివరించారు. కఠిన సవాళ్లను, ఆసక్తికర ఆవిష్కరణలను సాధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

### భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధిస్తే..

# క్రికెట్ మ్యాచ్ గెలిచేది

## పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, యూఎస్ఏ మ్యాచ్‌కు సుంకాలను ముడిపెడుతూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. క్రికెట్ మ్యాచ్ గెలిచేదని అన్నారు.భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఈఐం) అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. భారత్ ఉత్పత్తులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ డీల్ నేపథ్యంలో భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇచ్చిన విందుకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఎస్ఏ టీమ్‌కు విజయం దక్కకపోయినా.. ఆట తీరు అద్భుతం. క్రికెట్ గురించి పెద్దగా తెలియకపోయినా.. కొన్నేళ్లక్రితమే ఆటను మొదలుపెట్టిన ఈ జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. సెర్గియో ఈ గేమ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. 18 శాతం సుంకాలు విధించకపోయి ఉంటే.. గెలిచి ఉండేవాళ్లమని అప్పుడు సెర్గియో అనుకొని ఉంటారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక సూచన చేస్తున్నాను. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. మీ టీమ్ మ్యాచ్ గెలిచిఉండేది. ఏదేమైనప్పటికీ.. అమెరికా జట్టు ప్రదర్శన చూసి నేను ఆశ్చర్యపోయాను" అని గోర్‌ను ఉద్దేశించి మంత్రి అన్నారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా శనివారం రాత్రి భారత్, యూఎస్ఏ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌తో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. ముంబయి వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరివరకు పోరాడినా యూఎస్ఏ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. యూఎస్ఏ జట్టు ఆటతీరుకు ప్రశంసలు దక్కాయి.


# హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు!

సంక్షేమం కంటే విదేశీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వడం అమెరికా జాతి ప్రయోజనాలకు విరుద్ధమని గ్రెగ్ వాదిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను హరిస్తున్నాయని, అమెరికా పిల్లల కోసం 'అమెరికన్ డ్రీమ్'ను కాపాడాలంటే ఈ దోపిడీని అరికట్టాలని చెబుతున్నారు. అందుకే ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలాది మంది భారత టెకీల ఆశలపై నీళ్లు చల్లినట్లే. హెచ్-1బీ వీసా పొందుతున్న వారిలో 80 శాతానికి పైగా భారతీయులు, చైనీయులే ఉంటున్నారు. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేసింది. కొత్త వీసాలపై 1,00,000 డాలర్ల భారీ రుసుమును విధించి షాక్ ఇచ్చింది. పైగా లాటరీ విధానానికి బదులు ఎక్కువ జీతం ఇచ్చే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తక్కువ జీతం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు వీసా ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఫిబ్రవరి 27 నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. ట్రంప్ ప్రభుత్వ కఠిన విధానాలకు తోడు ఈ కొత్త బిల్లు అమెరికా వెళ్లాలనుకునే భారతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు

## గత రెండేళ్లలో జారీ చేసిన డీజీసీఏ

ఢిల్లీ: గత రెండేళ్లలో పలు నిబంధనల ఉల్లంఘన కారణంగా వాణిజ్య విమానయాన సంస్థలకు మొత్తంగా 352 షోకాజ్ నోటీసులను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసింది. 2024 జనవరి 1 నుంచి 2025 డిసెంబరు 31 వరకు ఇండిగోకు 98, ఎయిరిండియాకు 84 షోకాజ్ నోటీసులు వచ్చాయని రాజ్యసభకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమర్పించిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు 65, స్పైస్‌జెట్‌కు 45, ఆకాశ ఎయిర్‌కు 17, అలయన్స్ ఎయిర్‌కు 23, ఫ్లై బిగ్‌కు 12, ఏఐఎక్స్ కనెక్ట్‌కు 8, స్టార్ ఎయిర్‌కు ఒకటి చొప్పున షోకాజ్ నోటీసులు అందాయి. అయితే వీటిల్లో ఏఐఎక్స్ కనెక్ట్ ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో విలీనం అయ్యింది. ఈ 352 షోకాజ్ నోటీసుల్లో 139 నోటీసులకు సంబంధించి విమానయాన సంస్థలకు జరిమానా విధించారు. మరో 113 షోకాజ్ నోటీసుల వ్యవహారంలో విమానయాన సంస్థలకు డీజీసీఏ హెచ్చరిక ఆదేశాలను జారీ చేసింది. కేవలం 7 నోటీసుల విషయంలో సంతృప్తికర వివరణ అందినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. 2024-25లో భారత విమానయాన సంస్థల మొత్తం నష్టం రూ.5,289.73 కోట్లుగా నమోదైందని రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా గ్రూపు ఒక్కటే రూ.9,808.12 కోట్ల నష్టాన్ని చవిచూసిందని వెల్లడించారు. ఇందులో ఎయిరిండియా నష్టం రూ.3,975.75 కోట్లు కాగా.. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నష్టం రూ.5,832,37 కోట్లు. అలాగే ఆకాశ ఎయిర్ రూ.1,986.25 కోట్ల నష్టాన్ని నమోదుచేసింది. మొత్తం 11 విమానయాన సంస్థల్లో నాలుగే- ఇండిగో, బ్లూ డార్ట్, స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్ లాభాలను నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో కంపెనీల చట్టం నిబంధనల ఉల్లంఘనకు గాను 703 కంపెనీలపై మొత్తంగా రూ.55 కోట్ల జరిమానా విధించినట్లు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. ఇందులో రూ.7.51 కోట్లే వసూలైనట్లు వెల్లడించారు. ధరల పెంపు విషయంలో ఉక్కు తయారీ సంస్థలు కుమ్మక్కయ్యాయనే ఆరోపణల వ్యవహారంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తు నిర్వహిస్తోందని ప్రభుత్వం తెలిపింది. అలాగే యాంటీ కాంపిటీటివ్ విధానాల కింద 54 కేసులు నమోదయ్యాయని, 149 విలీన దరఖాస్తులు వచ్చాయని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.




# కొత్త ఈపీఎఫ్ఓ యాప్

## యూపీఐ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ కోసం..

ఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులు, తమ ఈపీఎఫ్‌లో ఉన్న సొమ్మును యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఉపసంహరించుకునే సదుపాయం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుంది. ఇందుకోసం సరికొత్త ఈపీఎఫ్ఓ మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈపీఎఫ్‌లో కొంత భాగం మినహా మెజారిటీ వాటాను చందాదారులు తమ బ్యాంకు ఖాతాలోకి యూపీఐ ద్వారా ఉపసంహరించుకునే సౌలభ్యాన్ని తీసుకొచ్చే ప్రాజెక్టుపై కార్మిక శాఖ పనిచేస్తుంది. ఈపీఎఫ్ఓ సరికొత్త మొబైల్ యాప్‌ను తీసుకురానుందని, ఇందులో సభ్యులు యూపీఐ ద్వారా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని, పాస్‌బుక్ బ్యాలెన్స్ వంటి ఇతర సేవలను కూడా పొందొచ్చని వెల్లడించాయి. కొత్త మొబైల్ యాప్‌లో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసేందుకు ఎంత ఈపీఎఫ్ మొత్తం అందుబాటులో ఉంది అనే వివరాలను చందాదారులు తెలుసుకోవచ్చు. చందాదారులు లావాదేవీలను పూర్తి చేయడానికి, వారి బ్యాంక్ ఖాతాలకు నిధులు భద్రంగా వెళ్లడానికి లింక్ చేసిన యూపీఐ పిన్‌ను వినియోగించాలి.



# హైడ్రా దెబ్బకు కూలుతున్న అక్రమార్కుల కబ్జాల సామ్రాజ్యం

## శేరిలింగంపల్లిలో మసకబారుతున్న ల్యాండ్ మాఫియా కీచక పర్వం

### మంగళవారం 700 కోట్ల విలువైన భూమికి కబ్జా నుండి మోక్షం

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :**

*హైడ్రా.. ఊహకందని అంచనా లు.. గజం జాగా కబ్జా చేసినోడి గుండెల్లో సైతం రైళ్లు పరిగెత్తించిన వైనం.. రియల్ ఎస్టేట్ ను సైతం ఒక్క చర్యతో శాసించిన సందర్భం... కొన్ని సందర్భాలలో రాజకీయాలకు తలొగ్గినదన్న అభాండాలపర్వం... కొంతమంది నిరుపేదల ఆర్తనాధాలతో శాపనార్థాల సమాహారం... పలు సంఘటనలలో కోర్టు సైతం మొట్టికాయలు వేసిన చరితం... అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో అడుగు అడుగును కూడా తీసుకుంటూ ఓవైపు ప్రభుత్వ మద్దతు... మరోవైపు సగటు మనిషి ప్రశంసలు అందుకుంటూ ఇంతింతై వటుడింతై అన్న రీతిన తిరిగి పూర్వవైభవాన్ని సంతరించు కుంటున్న అమోఘట్టం!*

హైడ్రా దెబ్బకు శేరిలింగంపల్లి లో కూలుతున్న అవినీతి కబ్జా సామ్రాజ్యం... ఏ ఘడియలో హైడ్రా శేరిలింగంపల్లిలో అడుగు పెట్టిందోకానీ వచ్చిన ప్రతిసారి పెనుసంచలనమే...! కొన్ని సందర్భాలలో జయజయ ద్వానాలతో ప్రజలు నిరాజనం పలుకగా... కొన్ని సందర్భాలలో కబ్జారాయుళ్లంతా లేనిపోని అభండాలు వేసి కోర్టు మెట్లు ఎక్కిన వైచిత్రం, ఇంకొన్ని సందర్భాలలో రాజకీయ ఒత్తిళ్ళను సైతం తోసి రాజని అనుకున్న పనిని పూర్తిచేసిన సందర్భంలో పలుకుబడిని ప్రయోగించి కోర్టుతో మొట్టికాయలు వేయించి బలవంతంగా తాఖీదులు అందజేసిన వైనం. ఏమైతేనేం కొన్నిసార్లు మోదం మరికొన్నిసార్లు ఖేదం అన్నతీరుగా హైడ్రా శేరిలింగంపల్లిలో ఒక్కో అడుగు ముందుకేస్తూ సాగుతున్న నేపథ్యంలో ఈ మధ్యకాలంలో చేపట్టిన కొన్ని చర్యలు కచ్చితంగా హైడ్రా సంస్థను సగర్వంగా సమున్నత స్థానంలో నిలబెట్టే దిశగా శేరిలింగంపల్లి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో సందేహంలేదు. ఈ క్రమంలోనే అమీన్పూర్ అయితేనేమి, మాదాపూర్ ఎన్ కన్వెన్షన్ అయితేనేమి, పటాన్చెరువు భూములయితేనేమి, నిన్న మొన్నటి దుర్గం చెరువు కబ్జా ఘటనైతేనేమి తాజాగా కొండాపూర్ పరిధి శేరిలింగంపల్లి జంగమోనికుంట ఘటన అయితే నేమి హైడ్రా తీసుకుంటున్న చర్యలు తప్పకుండా అక్రమార్కుల భూమాఫియా సామ్రాజ్యపు కుసాలను కదిలిస్తూ పేక మేడల గుట్టల్లా తొలిచి అవతల పారేస్తుండడం విశేషం. ఒకటి కాదు, రెండు కాదు వందల ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా బొక్కేసిన దళారులు పందికొక్కుల్లా తయారై శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి అంగుళం భూమిని అందినకాడికి దండుకోవడమే పరమావధిగా వ్యవహారం నడిపిస్తుండడం, దీనికి ఆయా రాజకీయ పార్టీలు తెర వెనుక నాటకం నడిపిస్తుండడంతో వారి దాష్టీకాలకు అంతే లేకుండా పోయింది.

**శేరిలింగంపల్లి అక్రమార్కులకు హైడ్రాతో ఇక దబిడి దిబిడే!**

గురుకుల్ ట్రస్టుల భూమి నుండి ఖానామెట్... అయ్యప్ప సోసైటీ... హాఫీజ్పేట్, మాదాపూర్ అంజయ్య నగర్, అమీన్పూర్, మియాపూర్ పరిధి గొలుసు కట్టు చెరువులు, గంగారం పెద్ద చెరువు, దుర్గం చెరువు, జంగమొని కుంట... ఇలా ఒకటేమిటి చెప్పుకుంటూ పోతే... చాంతాడంతలిస్టే ప్రస్తుతం అక్రమార్కుల చెరలో బందీ అయ్యింది. వేలకోట్ల రూపాయల విలువచేసే అత్యంత విలువైన భూమి ఇంకా ప్రైవేటు వ్యక్తుల పరమై ఉందంటే శేరిలింగంపల్లి పై ఎలాంటి దౌర్జన్యకాండ కొనసాగిందో ఇట్టే గమనించవచ్చు.

ఓవైపు అధికారులు, మరోవైపు భూకబ్జారాయుళ్లు, ఇంకోవైపు రాజకీయ దళారులు ఏకమై... భూ బకాసురుడి అవతారమెత్తి దొరికిన చోటల్లా భూమిని కబ్జా చేస్తూ ఇష్టానుసారంగా వాటిని కాలనీలుగా, విల్లాలుగా, అపార్ట్మెంట్లుగా, చివరకు ప్రైవేటు బస్సులకు లీజు భూములుగా మార్చి ప్రతినెల కొన్ని వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండి కొడితే.... 100 ఏనుగులను తిన్న రాబందు ఒక్క గాలి వాటానికి మృత్యువాత పడినట్లు శేరిలింగంపల్లిలో హైడ్రా వేసిన ఉక్కు పాదంతో భూకబ్జా రాయుళ్లు దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షుగా బ్రతుకును వెల్లదీస్తురనేది కాదనలేని నగ్నసత్యం. ఇప్పటికే వెయ్యి కోట్లకు పైగా ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకున్న హైడ్రా తాజాగా జంగమోనికుంట లోని 700 కోట్ల రూపాయల విలువ చేసే దాదాపు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకొని దానికి మంగళవారం కంచెను ఏర్పాటు చేయడం సర్వత్రాహర్షాతిరేకం వ్యక్తమౌతోంది. ఇది కదా ప్రభుత్వ బాధ్యత అంటే... ఇదే కదా ఒక స్వచ్ఛంద ప్రభుత్వ యంత్రాంగం చర్యకు ఫలితం, ఇలాగే ప్రతి వ్యవస్థలో అవినీతిని కడిగిపారేసి మకిలీ పట్టిన పరిపాలన వ్యవస్థను సంస్కరించాల్సిన తీరును మేధావులు, సామాజికవేత్తలు, విద్యావంతులు, యువకులు ఎత్తిచూపుతున్నారు.








# నేడే మున్సిపల్ ఎన్నికలు

- ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

**కరీంనగర్ బ్యూరో ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలో పోలింగ్ జరగనున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా చొప్పదండి మున్సిపాలిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే రూట్, మానిటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, అధికారులు సూచించిన చోటే బస చేయాలని ఆదేశించారు. చొప్పదండిలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది

**హయత్ నగర్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** మల్కాజిగిరి కమీషనర్ ఆదేశాల మేరకు నాకబంది లో భాగంగా మంగళవారం రాత్రి వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి ఆధ్వర్యం లో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి లోని అభ్యుదయ నగర్, చింతలకుంట ఏరియా లలో డామినేషన్ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించామని వనస్థలిపురం ఎస్హెచ్ఓ టి మహేష్ గౌడ్ తెలిపారు. మూడు టీములుగా విడిపోయి, చింతలకుంట, బిఎన్ రెడ్డి నగర్ లలో వెహికల్ చెకింగ్, లాడ్జిస్ చెకింగ్ చేశామని, లాడ్జిస్ చెకింగ్లో రూల్స్ పాటించని మూడు లాడ్జిస్ నిర్వాహకుల పై కేసు నమోదు చేయడం జరిగిందని, ఒక లాడ్జి లో పేకాట ఆడుతున్న వారిని పట్టుకోని, వారి మీద కేసు నమోదు చేశామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హయత్నగర్ ఎస్హెచ్ఓ, పి నాగరాజు గౌడ్, అబ్దుల్లాపూర్మెట్ ఎస్ హెచ్ ఓ అశోక్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్స్ సంతోష్ కుమార్, రాజేష్, పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



## 50 వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన మాదాపూర్ ఎస్ఐ వినయ్

**శేరిలింగంపల్లి ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మాదాపూర్ పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న వినయ్ 50 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. ఆంటీ కరప్షన్ బ్యూరో డి.ఎస్.పి వెల్లడించిన వివరాల ప్రకారం... మాదాపూర్ పోలీస్ జురిస్ డిక్షన్ లో నెలకొని ఉన్న ఒక ప్రైవేటు కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థకు చెందిన ఆర్థిక వివాదానికి సంబంధించి అందులోని ఓ బాధితుడిపై గతంలో కేసు నమోదైంది. అయితే ఈ కేసులోని సదరు బాధితుడికి 35(3) సెక్షన్ కింద నోటీసు అందజేయడానికి మాదాపూర్ ఎస్ఐ వినయ్ లక్ష రూపాయలను డిమాండ్ చేశాడు. కాగా బాధితుడు అంత మొత్తం ఇచ్చుకోలేనని వేడుకోవడంతో ఆ మొత్తాన్ని రెండు విడతలుగా చెల్లించాలని ఎస్ఐ సూచించారు. ఈ క్రమంలో మొదటి విడతగా 50 వేల రూపాయలు మంగళవారం ఇచ్చేందు కు ఒప్పందం కుదిరింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసిబి డిఎస్పి ఆనంద్ నేతృత్వంలోని బృందం మాదాపూర్ పిఎస్ పరిధిలో ఎస్ఐ వినయ్ బాధితుడి నుంచి సరిగ్గా 50 వేలను తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎస్ఐ వినయ్ వద్ద నుండి లంచం సొమ్మును రికవరీ చేసినట్లు ఏసిబి అధికారులు ధృవీకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం ఏసిబి ప్రత్యేక కోర్టుకు తరలించనున్నట్లు డి.ఎస్.పి తెలిపారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్, సీపీ
- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- 729 పోలింగ్ కేంద్రాలు.. 4.95 లక్షలకు పైగా ఓటర్లు
- ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా గట్టి బందోబస్తు



నిజామాబాద్, ఫిబ్రవరి 10: నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. నిజామాబాద్ నగర పాలక సంస్థలో 60 డివిజన్లకు 3,48,116 ఓటర్లు, 488 పోలింగ్ కేంద్రాలు; బోధన్లో 38 వార్డులకు 69,439 ఓటర్లు, 111 కేంద్రాలు; ఆర్మూర్లో 36 వార్డులకు 63,977 ఓటర్లు, 106 కేంద్రాలు; భీంగల్లో 12 వార్డులకు 14,046 ఓటర్లు, 24 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 714 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో చెక్ లిస్టు ప్రకారం అందిస్తామని, సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా 18 రకాల ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో ఏదైనా ఒకటి చూపి ఓటు వేయవచ్చని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ద్రవ పదార్థాలు నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటల లోపు కేంద్రంలోకి చేరుకున్న ఓటర్లకు క్యూ పద్ధతిలో టోకెన్లు జారీ చేసి ఓటింగ్ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరిపి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామని, 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. 7 ఏసీపీలు, 70 సీఐలు, 70 ఎస్ఐలు సహా 1370 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని, మూడు ప్లాటూన్ల పోలీసు బలగాలు చేరుకున్నాయని తెలిపారు. స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేశామని, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ బృందాలు నిఘా ఉంచుతున్నాయని చెప్పారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు ఉపేక్షించబోమని, ఆటంకాలు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. పాత నేరస్థులను బైండోవర్ చేశామని, 67 లైసెన్స్ తుపాకులు డిపాజిట్ చేశారని తెలిపారు. విలేకరుల సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

# ఎస్పీఆర్ హిల్స్ ప్రాంత ప్రజల ఇక్కట్లు తీరనున్నాయి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** బోరబండ, రహ్మత్నగర్ డివిజన్లలోని పలు కాలనీల్లో రాత్రి సమయాల్లో మంచినీటి సరఫరా వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు త్వరలో తీరనున్నాయి. రూ.2.5 కోట్లతో కొత్త ఫీడర్ మెయిన్ పైప్లైన్ నిర్మాణం చేపట్టిన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ.. ఉగాది నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తోంది. మంగళవారం ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలో నిర్మిస్తున్న పైప్లైన్ పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి దగ్గరుండి పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుని.. వేగం పెంచి ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే కార్మికుల సంఖ్య పెంచి, మరిన్ని గ్యాంగులు సమీకరించాలని సూచించారు. ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో మూడు రోజులకు ఒకసారి సరఫరా చేయడం, కొన్ని బస్తీల్లో రాత్రి సమయంలో సరఫరా, లో ప్రెషర్ సమస్యలు ఉండేవని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం బోరబండ, రహ్మత్నగర్ డివిజన్లలోని 52 బస్తీల నీటి సమస్య పరిష్కారానికి రూ.5.7 కోట్లతో 3 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేశామని.. గత మేలో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ పనులు పూర్తయితే కార్మిక నగర్, బ్రహ్మశంకర్ నగర్ ప్రాంతాల్లో రాత్రి సరఫరా నివారణతోపాటు నీటి ప్రెషర్ మెరుగవుతుందని చెప్పారు. నగరంలో రాత్రి సమయంలో సరఫరా అయ్యే ప్రాంతాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని, ఉదయం నుంచి సాయంత్రం వరకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎంలు తదితర అధికారులు పాల్గొన్నారు.



### ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల

# నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ , మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రామగుండం లోని సరస్వతి శిశు మందిర్ లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. అర్బన్ లోకల్ బాడీస్కు రెండవ సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరుగుతున్నాయని, మన జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సంబంధిత మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశామని, ప్రతిచోట పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ సామాగ్రిని ప్రశాంతంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. రామగుండంలో ఏకగ్రీవమైన ఒక డివిజన్ మినహాయించి జిల్లాలోని మిగిలిన 123 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయని, దాదాపు 470 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం నందు వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నామన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల బయట కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బంది అవసరమైన సామాగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ, ఆర్డీవోలు గంగయ్య, సురేష్,మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, మనోహర్, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు 800 పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు

- పోలింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్ అమలు)
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే. ఐపీఎస్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి);** సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో జరుగు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునెల, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 800 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.మంగళవారం సిరిసిల్ల,వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఎస్పీ దిశ నిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో రూట్ మొబైల్స్ 17 జోనల్ టీమ్స్ 06 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), రిసర్వ్ టీమ్స్ 04 ,స్ట్రయికింగ్ ఫోర్స్ 02 , స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్ : 02 , ఏర్పాటు చేసి మొత్తం 800 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని,రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని,పోలింగ్ కేంద్రాల వద్ద,రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు.ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 బిఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుందని,ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని,ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని తెలిపారు.ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు.ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి,ఇన్స్పెక్టర్ లు,ఆర్.ఐ లు,ఎస్.ఐ లు , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## జిల్లాలో పోలింగ్ సర్వ సిద్ధం..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలో ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసిందని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి నామినేషన్ల స్వీకరణ,పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు మొదలుకొని ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలాము నకలైంది. రెండు మున్సిపాలిటీలో 67 వార్డులు ఉండగా 175 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారు 1.23,100 లక్షల మంది ఓటు హక్కు వినియోగిం చుకోనున్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రీసైడింగ్ ఆఫీసర్ అసిస్టెంట్ రీసైనింగ్ ఆఫీసర్లతోపాటు రిజర్వ్ అధికారులను, మైక్రో అబ్జర్వర్లను నియమించమన్నారు.ప్రతి పోలిం గ్ కేంద్రంలో వెబ్ కాస్ట్ ఏర్పాటు చేశామన్నారు.

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..**

జిల్లాలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను మంగళవారం ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ విధుల్లో ఉన్న సిబ్బంది, ఇతర ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నిక అధికారులకు సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చి పూర్తి చేసినట్లు తెలిపారు.ఎన్నికల నిబంధన మేరకు అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు పోలింగ్ అధికారులు సిబ్బంది బ్యాలెట్ పేపర్ బాక్సులు చెక్ చేసుకోవాలన్నారు. పోలింగు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి నట్లు చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. జిల్లా అదరపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, మున్సిపల్ కమిషనర్లు కదిరి భాషా, సంపత్ కుమార్ తాసిల్దార్ మహేష్ కుమార్, జయంత్ కుమార్ పాల్గొన్నారు.

# ఒట్టేసి చెప్పు.. ఓటు నాకేనని!

## ధనం-దావత్‌దేపై చేయి..




### సిరిసిల,వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర పోటీ..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** ఒట్టేసి చెప్పు ఓటే నాకేనని అంటూ సిరిసిల్ల,వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో పలువురు అభ్యర్థులు ఓటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు చర్చ సాగుతోంది. ఇతర పార్టీల అభ్యర్థులు,నాయకులు ఒకే సమయంలో ఓటర్లను కలిసేందుకు రావడంతో పలు చోట్ల ఓటర్లు ఇరకాటంలో పడిన పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్లు ఖరారైన నాటి నుంచి ఆశావాహులు ఆయా వార్డుల్లో ప్రచారాన్ని ప్రారంభించి ఓటర్లను ఆకట్టుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేశారు.నోటిఫికేషన్ అనంతరం ప్రచారాన్ని మరింత ఉధృతం చేసి నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు రకరకాల ప్రలోభాలకు గురిచేస్తూ ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. డబ్బులు, మద్యం, మాంసం వంటి ప్రలోభాలతో పాటు గెలుపు అనంతరం చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరిస్తూ,ప్రత్యర్థి అభ్యర్థుల వైఫల్యాలను ఎత్తిచూపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ముగిసినా,అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు పరోక్షంగా ప్రలోభాల రాజకీయాన్ని కొనసాగించినట్లు సమాచారం.

వలస ఓటర్లు, గంపగుత్త ఓట్లపై ప్రత్యేక దృష్టి.. ఉద్యోగం, జీవనోపాధి కోసం ఇతర పట్టణాలు,గ్రామాల్లో నివసిస్తున్న వలస ఓటర్లపై అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఓటింగ్ రోజు వారిని రప్పించేందుకు వాహనాలు సమకూర్చడం,రవాణా చార్జీలు ఇచ్చేందుకు తమ బంధువులతో ఫోన్లు చేయించారు.అన్ని విధాలుగా చూసుకుంటామని హామీ ఇస్తూ ఓటు వేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.అలాగే ఒకే ఇంటి నుంచి లేదా ఒకే సామాజిక వర్గానికి చెందిన గంపగుత్త ఓట్లపై కూడా అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఓట్లకు ఇంత అంటూ లావాదేవీలు,దావత్లతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ ప్రలోభాలు ఎంతవరకు అనుకూలంగా మారుతాయోనన్న ఆందోళన అభ్యర్థులలో కనిపిస్తోంది.



## నగర ప్రజలకు మేయర్ కృతజ్ఞతలు

### సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు

ఐదేండ్లు హైదరాబాద్ మహానగరపాలక సంస్థ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం ఇచ్చిన నగర ప్రజలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మేయర్‌గా నగరాభివృద్ధికి శాయశక్తుల కృషి చేశానని ఆమె తెలిపారు. నగరాభివృద్ధికి తోడ్పాటు అందించిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌కి, శ్రీధర్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేయర్‌గా తన పదవీ కాలంలో సహకారం అందించిన డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డికి, కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కి, పూర్వ కమిషనర్లు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కౌన్సిల్ సభ్యులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

# దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

### 30 తులాల వెండి ఆభరణాల స్వాధీనం



**బోయిన్ పల్లి ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేధించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 30 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ వెల్లడించారు.వరదవెల్లి గ్రామానికి చెందిన కొంకటి తిరుపతి ఇంట్లో ఈనెల7వ తేదీ తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి వెండి పూజా వస్తువులను దొంగిలించారు. ఈ ఘటనపై బాధితుడు బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, ఎస్.ఐ రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలు, సాంకేతిక సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన కంచు శివశంకర్ (20) సిరిసిల్ల సంజీవయ్య నగర్‌కు చెందిన సామల్ల బాలకిషన్ (30) ,(ప్రస్తుతం వేములవాడ సుభాష్ నగర్ చెందిన ) నిందితులను గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు బోయినపల్లి ఎస్.ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.గాలింపులో భాగంగా కోదురుపాక చౌరస్తా వద్ద బస్సు కోసం వేచి ఉన్న సమయంలో నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 30 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ తెలిపారు.త్వరితగతిన కేసు ఛేధించిన ఎస్.ఐ రమాకాంత్, ఫింగర్ ప్రింట్ ఎస్.ఐ క్రాంతి, సిబ్బంది కోటి, లక్ష్మీనారాయణ, సుధాకర్, వెంకటేష్‌లను వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సి.ఐ కోరారు.

## ఓయూ రాజనీతి శాస్త్ర సదస్సులో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై విస్తృత చర్చ

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 10:** ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న సదస్సు రెండో రోజు కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సమకాలీన రాజ్యాంగ, విధాన, పాలనా సవాళ్లను లోతుగా విశ్లేషిస్తూ అకాడమిక్‌గా సార్థకంగా కొనసాగిందని నిర్వాహకులు ప్రొఫెసర్ కృష్ణకుమార్, ప్రొఫెసర్ చలమల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. "సమకాలీన భారతదేశంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల పునః ఆవిష్కరణ" అంశంపై దేశ నలుమూలల నుంచి హాజరైన రాజనీతి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు "ఒకే దేశం-ఒకే ఎన్నిక"పై పరిశోధనా పత్రాలు సమర్పించి లోతైన చర్చలు జరిపారు. ఈ సంస్కరణ రాజ్యాంగ వ్యవస్థ, సమాఖ్య పాలన, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిపై కలిగించే ప్రభావాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సమకాలీకరణ వల్ల పాలనా స్థిరత్వం పెరుగుతుందా? ప్రజాస్వామ్య బాధ్యత, ప్రాంతీయ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న అంశాలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆర్థిక సమాఖ్య, వనరుల పంపిణీ అంశాలపై జరిగిన సాంకేతిక సెషన్లలో జీఎస్టీ వ్యవస్థ, కేంద్ర పథకాలు, రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రత, కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై విశ్లేషణ జరిగింది. కేంద్ర బడ్జెట్ కేటాయింపులు రాష్ట్రాల అభివృద్ధిపై చూపుతున్న ప్రభావాన్ని పరిశోధకులు వివరించారు. డిజిటల్ విధానాలు సమాఖ్య వ్యవస్థలో కేంద్ర-రాష్ట్ర సమన్వయా న్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశంపై పత్రాలు ప్రదర్శించబడ్డాయి. చలమల్ల వెంకటే శ్వర్లు, డాక్టర్ నాగం కుమారస్వామి అధ్యక్షత వహించగా డాక్టర్ మారోజు రామచారి, డాక్టర్ జహీదా బేగం సహాధ్యక్షులుగా వ్యవహరించారు. వాతావరణ మార్పు, ఆరోగ్యం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ రంగాల్లో కేంద్ర-రాష్ట్ర సహకారం అవసరమనే అంశాలపై కూడా విస్తృత చర్చ జరిగింది. ఈ రంగాలు సమాఖ్య పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. ఈ సెషన్‌కు డాక్టర్ కె. రాజారాం అధ్యక్షత వహించగా డాక్టర్ కె. భాస్కర్ సహాధ్యక్షులుగా వ్యవహరించారు.

### పారమిత హెరిటేజ్ స్కూల్‌లో

# అంబరాన్నంటిన 'మైత్రేయ' వీడ్కోలు సంబరాలు

- చైర్మన్ డా. ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన
- వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, క్రమశిక్షణపై ఆయన సూచనలు
- తొమ్మిదవ తరగతి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి



**కరీంనగర్ బ్యూరో ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ సీబీఎస్ఈ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన 'మైత్రేయ' వీడ్కోలు సంబరాలు అంబరాన్నంటాయి. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం వెలిగించిన ఆ దీపం.. విద్యార్థుల భవిష్యత్తు కూడా అంతే ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కేవలం పుస్తక జ్ఞానం, మార్కులే జీవితం కాదని, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గత 11 సంవత్సరాలుగా పారమితలో చదివిన విద్యార్థులు నైతిక విలువలు, స్వీయ క్రమశిక్షణ, ఆత్మనియంత్రణ వంటి ఉత్తమ లక్షణాలు పెంపొందించుకోవడం అభినందనీయమని కొనియాడారు. రేపటి సమాజ సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ విలువలే ఆయుధాలని పిలుపునిచ్చారు. దాదాపు ఒక దశాబ్ద కాలం ఒకే గొడుగు కింద చదువుకున్న విద్యార్థులు పాఠశాలను వీడి వెళ్తున్న తరుణంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆటపాటలు, పరీక్షలు, ఉపాధ్యాయుల మందలింపులు, స్నేహితుల ముచ్చట్లు వంటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు, సహకరించిన ఉపాధ్యాయేతర సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం జీవిత ప్రయాణంలో దిక్సూచిలా ఉంటుందని భావోద్వేగంతో చాటిచెప్పారు. వీడ్కోలు సభ కన్నీటితోనే కాకుండా విద్యార్థుల నృత్యాలు, కేరింతలతో ఉత్సాహంగా సాగింది. సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వచ్చే బోర్డు పరీక్షల్లో అఖండ విజయం సాధించి తల్లిదండ్రులు, విద్యాసంస్థకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, వినోద్ రావు, రాకేష్, అనూకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, ప్రిన్సిపల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు బైకులను ఢీకొట్టిన గూడ్స్ ఆటో

### ఒకరు మృతి, మహిళ విషమం!

- మాల్-నల్గొండ రహదారిపై దారుణ ప్రమాదం
- బైక్‌పై ఉన్న యువకుడు మృతి.. మహిళ పరిస్థితి విషమం
- కాళ్లు విరిగిపోయిన గాయాలు.. నల్గొండ ఆసుపత్రికి తరలింపు



**మర్రిగూడ, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డి పల్లి గ్రామం వద్ద మాల్-నల్గొండ రహదారిపై దారుణ ప్రమాదం జరిగింది. మాల్ వైపు వెళ్తున్న గూడ్స్ ఆటో.. ఎదురుగా వస్తున్న రెండు బైకులను ఢీకొట్టింది. ఈ భయానక ప్రమాదం లో ఒక యువకుడు మృతి చెందగా.. మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో కనగల్ మండలం బుడమర్లపల్లి గ్రామానికి చెందిన మోర శివ (20), రేణుక, చిన్న పాపకు.. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన ఈద స్వామి, స్వప్నకు తీవ్ర గాయాలయ్యాయి. శివ, రేణుకకు కాళ్లు విరిగిపోయాయి. 108 సాయంతో వారిని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివ మరణించాడు. రేణుక పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ రోడ్డు మార్గం నిత్యం ప్రమాదాల బారిన పడుతోంది. మూల మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# సోమవారం ఫిర్యాదు.. మంగళవారం పరిష్కారం

- పాఠశాలకు క్రీడామైదానాన్ని అందించిన హైడ్రా
- 33 గుంటల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్




**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** ప్రభుత్వ పాఠశాలకు క్రీడామైదా నాన్ని తిరిగి అందుబాటులోకి తెచ్చింది హైడ్రా. తమ పాఠశాల క్రీడామైదానం 33 గుంటల మేర ఉండగా.. వాహిద్ అనే వ్యక్తి ఆక్రమించి తన ఆధీనంలోకి తీసుకున్నారని ఆ పాఠశాల హెడ్ మాస్టర్ హైడ్రా ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు 24 గంటల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపారు హైడ్రా అధికారులు. సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఈ మేరకు ఫిర్యాదు చేయగా.. మంగళవారం ఆక్రమణలను హైడ్రా తొలగించింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి, వెంకటేశ్వర నగర్ కాలనీలోని జడ్‌పీహెచ్ ఎస్ స్కూల్‌కి కేటాయించిన 33 గుంటల క్రీడామైదానాన్ని తిరిగి ఆ పాఠశాలకు చెందేలా హైడ్రా చర్యలు తీసుకుంది. క్రీడా మైదానం వైపు ఇంటి ద్వారం పెట్టుకుని మొత్తం ఆక్రమించి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారనే ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. ఆక్రమలను తొలగించి పాఠశా లకు మాత్రమే వినియోగంలోకి వచ్చేలా హైడ్రా ఫెన్సింగ్ వేసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు.. స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. విద్యార్థులకు క్రీడామైదానం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో పరిష్కారం లభించడం హైడ్రాతోనే సాధ్యమని పలువురు పేర్కొన్నారు.



### మున్సిపల్ ఎన్నికల పోలింగ్

# నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్, అబ్జర్వర్

**బోధన్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామాగ్రి తో సిబ్బంది తరలింపు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై ఇప్పటికే అన్ని కసరత్తులు పూర్తి చేశామని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 11న జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ అంకిత్, ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి వేర్వేరుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. బోధన్ మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అయిన విజయ మేరీ హైస్కూల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నందున, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పోలింగ్ బూత్ లలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రతి పీ.ఎస్ లో ఓటర్లకు సహకరించేలా బీ.ఎల్.ఓలతో కూడిన హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా నిఘా బృందాలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం 5.00 గంటలు దాటిన తరువాత కూడా టోకెన్లు జారీ చేసి, ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ తహసీల్దార్ విఠల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ సామగ్రి పంపిణీ పరిశీలించిన కలెక్టర్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 92 వార్డులు.. 239 పోలింగ్ కేంద్రాలు.. 1.49 లక్షలకు పైగా ఓటర్లు
- వంద శాతం పోలింగ్ జరగాలి.. ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించండి
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి.. గట్టి భద్రత



కామారెడ్డి, ఫిబ్రవరి 10: కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో రేపు (బుధవారం) జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, వంద శాతం పోలింగ్ జరగాలని సూచించారు. ఎస్పీ కార్యాలయంలోని ఏఎంసీ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూ షన్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. ఎన్నికల అధికారులు సామగ్రిని సకాలంలో, సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం పూర్తిగా సిద్ధమని స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బంది బస్సుల ద్వారా కేంద్రాలకు తరలిస్తున్నారని చెప్పారు.విధులు నిర్వహించే అధికారులు సమస్యలు తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామగ్రిని చెక్‌లిస్ట్ ఆధారంగా పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అవసరమైన వస్తువులు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆదేశించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. జిల్లాలో కామారెడ్డిలో 49 వార్డులు, 152 పోలింగ్ కేంద్రాలు, 99,313 ఓటర్లు; ఎల్లారెడ్డిలో 12 వార్డులు, 24 కేంద్రాలు, 13,265 ఓటర్లు; బాన్సువాడలో 19 వార్డులు, 39 కేంద్రాలు, 24,188 ఓటర్లు; బిచ్కుందలో 12 వార్డులు, 24 కేంద్రాలు, 12,759 ఓటర్లు. మొత్తం 92 వార్డులు, 239 పోలింగ్ కేంద్రాలు, 1,49,525 ఓటర్లు ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఆర్‌డీఓ వీణ, తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
11 ఫిబ్రవరి 2026

# ఎన్నికల ప్రాంతాల్లో నేడు సెలవు

- ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు
- ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు వర్తింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం పోలింగ్ రోజును సెలవుగా ప్రకటించింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది. తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. రేపు (ఫిబ్రవరి 11) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# మహదేవప్ప మృతి మంత్రే కారణం!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇది అత్యంత భాధాకరమని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణంగా తెలుస్తోందన్నారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే భాజపా అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. అహంకారపూరిత రాజకీయ నాయకుడి వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటనకు కారణమైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలి. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలి. లేనిపక్షంలో భాజపా కార్యకర్తల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం చేస్తుంది' అని రామచందర్‌రావు అన్నారు. ఈ ఘటనపై ఎని&్న్యకల సంఘానికి రాంచందర్‌రావు ఫిర్యాదు చేశారు.

# బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

- యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు



**హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చుని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో రంగంలోకి ఈడీ

**తిరుమల, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

# స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదు

- మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ ఆవేదన

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సామాన్యులు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేదు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది పోలీసులు అధికార పార్టీకి సహకరిస్తూ బీఆర్ఎస్ నాయకులును వేధిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారులు పని చేయాల్సి ఉంటుంది కానీ,పోలీస్ డిపార్ట్‌మెంటే మొత్తం నడిపిస్తుందని ఆరోపించారు. పోలీసు శాఖ వ్యవహారం చూస్తే సిగ్గు అనిపిస్తుంద్నారు. ఎన్నికల రూల్స్ అందరికి ఒకేలా ఉండాలి. కానీ బీఆర్ఎస్ అభ్యర్థులకే రూల్స్ వర్తిస్తున్నాయని తెలిపారు. పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సీఎం సొంత జిల్లాలోనే అరాచకాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణీకి పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపించాఉ. ఎన్నికలే లేకుండా పోలీసులు అందరినీ విత్ డ్రా చేయిస్తే అయిపోయేదిగా! అని ఎద్దేవా చేశారు.

# హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

- 1.89 లక్షల ఉద్యోగాల భర్తీకి బడ్జెట్ లో ప్రొవిజన్ పెట్టాలి
- బీసీలకు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- ఓవైసీ బ్రదర్స్ పొద్దు తిరుగుడు పువ్వులు
- లేబర్ కోడ్, ఉపాధి హామీ అంశాలపై సీఎం స్పందించాలి.
- లేబర్ కోడ్ కు వ్యతిరేకంగా జరిగే బంద్‌కు జాగృతి మద్దతు.
- ఈ నెల 12 న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ.
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎక్కడా ప్రజాసమస్యల గురించి ఏ పార్టీలూ మాట్లాడలేదని, కేవలం ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం మాత్రమే చేశారని ఎద్దేవా చేశారు. బస్తీ దవాఖానాల్లో గోలీలు లేవని, డాక్టర్లు లేరని, వాటిపై రివ్యూ కూడా లేదని, రోడ్లపై, డ్రైనేజీ లో చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకపోయిందని, ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోవటం లేదని, వ్యక్తులను తిట్టటానికే మున్సిపల్‌ఎన్నికలు పరిమితమయ్యాయని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మంచివాళ్లను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిశాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా సర్దుబాట్లు చేసుకున్నాయని ఆరోపించారు. సింహం గుర్తు పై పోటీ చేస్తున్న మా అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 111 మున్సిపాలిటీలు ఉంటే ఒక్క మున్సిపాలిటీకి మాత్రమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వచ్చిందని, గుంపుమేస్త్రీ, గుంటనక్క స్నేహం కారణంగా సిద్దిపేట్ కు మాత్రమే మాత్రమే మంజూరు చేశాని, బీఆర్ఎస్ ఉన్న కాంగ్రెస్ ఉన్న గుంటనక్కకే పనులు అవుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రభుత్వం వచ్చాక సంపద పెంచాల్సింది పోయి ఏడువేల కోట్ల రూపాయల భూములు అమ్ముకున్నారని, రెవెన్యూ డిఫిసిట్ 9 వేల కోట్లు ఉందని, సంపద సృష్టి లేదని, అప్పులు మాత్రం 122 శాతం ఎక్కువగా చేశారని తలిపారు. ఫించన్ల కోసం గత బడ్జెట్ లో పెట్టిన లక్షా 21 వేల కోట్లలో 51 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, పేదలకు ఇచ్చే పెన్షన్లకు కోత పెట్టి కాంట్రాక్టర్లకు డబ్బులు ఇచ్చారని, కమీషన్లు ఎక్కువ వచ్చే చోట డబ్బులు ఖర్చు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

# హైడ్రా పనితీరు భేష్

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ఉప్పల్ నల్లచెరువు పరిశీలన



**ఉప్పల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** పర్యావరణ హితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి హైడ్రా చేస్తున్న కృషి అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణలో హైడ్రా చొరవను కొనియాడారు. మరీ ముఖ్యంగా నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా ఎంతో కృషి చేస్తోందన్నారు. చెరువుతో పాటు ఆ పరిసర ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. వరద నివారణతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్యానికి, భూగర్భ జలాల పరిరక్షణకు చెరువుల ప్రాధాన్యతను గుర్తించే వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఉప్పల్‌లోని ఎస్ ఎన్ డీపీ ప్రాజెక్టు పనులు ప్రారంభోత్సవానికి మంగళవారం వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీ పి. మహేందర్ రెడ్డితో కలిసి ఐటీ మంత్రి ఉప్పల్ నల్లచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువును ఎలా అభివృద్ధి చేస్తున్నారు.. ఎలా తీర్చిదిద్దుతున్నారు అనే విషయాలను అక్కడ చెరువు పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ యజమాని మహమ్మద్ యూనస్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన 3డీ నమూనాలను మంత్రి పరిశీలించారు.

## ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలి

ఉప్పల్ నల్లచెరువు ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఈ చెరువుంది.. దాదాపు కిలోమీటరు పొడవునా చెరువు విస్తరించి ఉంది. రోడ్డు పొడవునా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. చెరువు చుట్టూ 2 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్ వస్తుందని.., చిన్న పిల్లలు ఆడుకునే ప్లే ఏరియా, చెరువు చుట్టూ సీటింగ్ సౌకర్యం, పచ్చిక బైళ్లు, పార్కులు, అన్ని వయసుల వారికి వ్యాయాయ పరికరాలు అందుబా టులోకి వస్తున్నాయని అక్కడ పనులు చేపడుతున్న వారు మంత్రికి తెలి పారు. మురుగు నీరు కలవకుండా డైవర్ట్ కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆక్రమణలతో 55 ఎకరాలకు కుంచించు కుపోయిన చెరువును 69 ఎకరాలకు విస్తరించామని, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇప్పటికే పలు మార్లు ఇక్కడికి వచ్చి పనులను పర్యవేక్షించారన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో హైడ్రా అధికారుల చొరవ చెరువు విస్తరణకు దోహద పడిందని తెలిపారు. చెరువులో 3 మీటర్ల మేర పూడికను తొలగించామని, ప్రధాన ద్వారం చెరువుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు.



# మహాశివరాత్రి జాతర మహొత్సవాలకు రండి

- వేములవాడ ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

# మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- భారీగా దగ్ధమైన కార్లు...పెద్ద ఎత్తున నష్టం



**హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.

## పీఎంజీవై నిధుల మంజూరుకు

# కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

- సిఎస్ కె.రామకృష్ణా రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీఎంజిఎస్‌వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

# వ్యవసాయ రంగానికి ఊతమివ్వండి

- కమ్యూనిటీ ఫార్మింగ్‌కు నిధులు విడుదల చేయాలి
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌కు సిఎం చంద్రబాబు వినతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి10 (జనంసాక్షి) :** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వల్ల అందించే ప్రోత్సాహకాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.216 కోట్లు ఇవ్వాలని కోరారు. 2024-25లో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగుకు మొగ్గ చూపుతూ సమ్మతి తెలిపారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్ల మేర సాయం చేయాలని కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని, అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. రాష్ట్రంలో జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి ఎక్కువగా పండుతోందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకమన్నారు. ఏపీ వ్యవసాయాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందు కోసం కేంద్రం ప్రత్యేక బృందాన్ని నియమించిందని చెప్పారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో ఏపీకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370